


KADILIMCHE VAARTHA Telugu daily

# కదిలించే వార్త

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 245 | శుక్రవారం | 22 మే 2026 | పేజీలు 8 | వెల : 05



# వామ్మో.. 48 డిగ్రీలు!

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు భగ్గుమంటున్నాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రికార్డు స్థాయిలో 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి

పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది


వచ్చే వారం రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం

ప్రజలు అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం బయటకు రావొద్దని సూచన

తెలుగు రాష్ట్రాల్లో రోళ్లు పగిలే ఎండలు..

రికార్డులు బద్దలు కొడుతున్న ఉష్ణోగ్రతలు..

హైయెస్ట్ రిపోర్ట్ చూస్తే మంటలే..



సమ్మర్ హీట్ నెక్ట్స్ లెవెల్‌కి చేరింది. బయటకొచ్చారా.. మాడు పగిలిపోద్ది అంటూ డేంజర్ బెల్స్ మోగిస్తున్నాడు సూర్యుడు. ఎండల ధాటికి తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నిప్పుల కొలిమిలా మారిపోతున్నాయి. చాలా ప్రాంతాల్లో రోళ్లు, రాళ్లు పగిలే ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు నరకం చూస్తున్నారు.

## తమిళనాడు చరిత్రలో ఇదొక టర్నింగ్ పాయింట్



- క్యాబినెట్ బెర్తులు దక్కడంపై కాంగ్రెస్
- తమిళనాడు ప్రభుత్వం క్యాబినెట్ విస్తరణ
- కాంగ్రెస్ నుంచి ఇద్దరికి అవకాశం
- తమ పార్టీ నేతలు అధికారం కోసం విశ్వాసం, అంకితభావంతో గత 59 ఏళ్లుగా పనిచేస్తున్నారన్న హస్తం పార్టీ



## 282 ప్రాజెక్టులకు ఆమోదం.. 114 ప్రాజెక్టులు గ్రౌండింగ్

### సీఎం చంద్రబాబుకు వివరించిన మంత్రుల కమిటీ

**అమరావతి**

భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు, ఎస్ఐపీబీలో ఆమోదించిన 282 ప్రాజెక్టులకు గాను 114 ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యాయని సీఎం చంద్రబాబకు మంత్రుల కమిటీ వివరించింది. గురువారం మంత్రుల కమిటీతో సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల కమిటీకి ఎంఓయూలు, ప్రాజెక్టుల పురోగతిపై సీఎం దిశానిర్దేశం చేశారు. ఎస్ఐపీబీల ద్వారా ఇప్పటికి రూ.11.47 లక్షల కోట్ల పెట్టుబడులతో 282 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామన్న సీఎం. వీటిలో 114 ప్రాజెక్టులు గ్రౌండ్ అయినట్టు మంత్రుల కమిటీ చైర్మన్ లోకేష్ సీఎం చంద్రబాబుకు వివరించారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులకు అనుమతులు, భూ కేటాయింపులతో పాటు ప్రాజెక్టులు గ్రౌండింగ్‌కు వెళ్లేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచనలు చేశారు. సమావేశానికి సీఎస్ సాయిప్రసాద్, మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్ధన్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కార్యకర్తే అధినేత



- స్త్రీ శక్తి థీమ్‌తో మహానాడు నిర్వహించేందుకు పొలిట్ బ్యూరో నిర్ణయం
- మహానాడులో 19 తీర్మానాలు చేపట్టాలని పొలిట్ బ్యూరో నిర్ణయం
- ఏపీ-10, తెలంగాణ-4, అండమాన్‌కు సంబంధించి ఒక తీర్మానంపై చర్చ
- ఉమ్మడి తీర్మానాలు-4, రాజకీయ తీర్మానాలపై చర్చ

**అమరావతి**

తెలుగుదేశం మహానాడును ఈసారి "స్త్రీ శక్తి" థీమ్‌తో నిర్వహించాలని పార్టీ అధినేత చంద్రబాబు నిర్ణయించారు. సంప్రదాయ ఓటు బ్యాంకును కాపాడుకుంటూ, పార్టీ వెన్నుదన్నైన బీసీలకు భరోసా ఇచ్చేలా మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తే అధినేత అనేది ప్రతిబింబించేలా శ్రేణులందిరినీ భాగస్వాములను చేస్తూ, సరికొత్త ఉత్సాహంతో ఈ వేడుకను పండుగలా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత చంద్రబాబు అధ్యక్షతన జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో "మహానాడు-2026" నిర్వహణ ప్రధాన అజెండాగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈసారి "స్త్రీ శక్తి" ప్రధాన థీమ్‌గా 2026 మహానాడును నిర్వహించాలని పొలిట్ బ్యూరో నిర్ణయించింది. పార్టీ ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు మహిళా సంక్షేమం, సాధికారత కోసం దేశంలోనే ఆదర్శంగా - మిగతా3లో



## ఇరాన్‌పై దాడి చేయాలా.. శాంతి చర్చలా..?

- ట్రంప్, నెతన్యాహు మధ్య విబేధాలు
- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేసిన సంగతి తెలిసిందే
- ప్రస్తుతం కాల్పుల విరమణ కొనసాగుతోంది
- శాంతి చర్చలు ఎటూ తేలడం లేదు.

# ఎవరిది గొడ్డలి పార్టీ.. ఎవరిది గన్ కల్చర్

- చంద్రబాబు నిర్ణయాలతో భవిష్యత్తులో ఏపీకి రాజధాని నీలినీడలు
- బాబు ష్యూరిటీ-- మోసం గ్యారంటీ
- రెండేళ్ల ప్రోగ్రెస్ రిపోర్ట్ చూస్తే అత్యంత ఘోరం
- 'మావిగన్' అంటే బాబుకు గుండె ఆగిపోయేలా ఉంది
- ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తూ జంగిల్ రాజ్‌గా రాష్ట్రాన్ని మార్చారు
- మీడియా సమావేశంలో వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్



**అమరావతి**

చంద్రబాబు నిర్ణయాలతో భవిష్యత్తులో ఏపీకి రాజధాని లేకుం డా చేస్తున్నారని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ రెండేళ్ల చంద్రబాబు పాలనలో ప్రజలకు పలానా మంచి చేశానని చెప్పుకునే పరిస్థితి చంద్రబాబుకు ఏ కోశానా లేదు. బాబు ష్యూరిటీ-- మోసం గ్యారంటీ, అన్నదాన్ని ప్రతిరోజూ రుజువు చేస్తూనే ఉన్నాడు. ఈ మధ్యకాలంలో చంద్రబాబు బీపీకి కారణం, మావిగన్. ఆచరణ సాధ్యం కాదని తెలిసినా అమరావతిపై ముందుకు వెళ్తున్నారు. స్కామ్‌ల కోసమే చంద్రబాబు ముందుకెళ్తున్నారు. ఇప్పటికే అమరావతికి రూ.47,387 కోట్లు అప్పు చేశారు. ఖజానా నుంచి రూ.9200 కోట్లు ఖర్చు చేయబోతున్నారు. స్కామ్‌ల కోసం రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్నారు. ప్రశ్నిస్తే చంద్రబాబుకు బీపీ పెరుగుతోంది. రాష్ట్రానికి రాజధాని ఉండాలనే మావిగన్‌ను ప్రతిపాదించాం. రాష్ట్ర పరిస్థితుల దష్ట్యా - మిగతా3లో




## 60 రోజుల్లో ఉద్యోగం తెచ్చుకోండి

- లేదంటే దేశం విడిచి వెళ్లండి..
- అమెరికాలో హెచ్1బి గండం
- అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వేలమంది భారతీయులు ప్రస్తుతం ఉద్యోగాలు కోల్పోతున్నారు
- అమెరికాలో ఎదగాలని ఆశలు పెట్టుకున్న ఎంతోమంది భారతీయులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదు
- అమెరికాలో హెచ్1బి గండం
- అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వేలమంది భారతీయులు ప్రస్తుతం ఉద్యోగాలు కోల్పోతున్నారు

# పట్టణ ప్రాంతాల్లో రింగ్‌రోడ్లు, బైపాస్‌లు

- ఏపీలో రూ.1,990 కోట్ల విలువైన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం
- నాలుగు కీలక పట్టణ మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- ఈ ఫండ్ ద్వారా మొత్తం రూ.497.71 కోట్ల కేంద్ర సాయం మంజూరు
- విశాఖ, మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్లలో ప్రాజెక్టులకు ఆమోదం



**అమరావతి**

రాష్ట్రంలో రూ.1,990.83 కోట్ల విలువైన అర్బన్ చాలెంజ్ ఫండ్ ప్రాజెక్టులకు కేంద్ర ఆమోదం తెలిపిందని మంత్రి నారాయణ తెలిపారు. నాలుగు కీలకమైన పట్టణ మౌలిక వసతుల ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ కేంద్రం ఇచ్చిందన్నారు. ఈ ఫండ్ ద్వారా మొత్తం రూ.497.71 కోట్ల కేంద్ర సాయం మంజూరు చేసిందన్నారు. విశాఖపట్నం, మంగళగిరి--తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లలో ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద నాలుగు ప్రాజెక్టులకు ఆమోదం రావడం రాష్ట్రానికి గొప్ప గుర్తింపు అని - మిగతా3లో

# ఎవరిది గొడ్డలి పార్టీ.. ఎవరిది గన్ కల్చర్

-మొదటిపేజీ తరువాయి

మావిగన్‌ను ప్రత్యామ్నాయంగా చూపించాం. అమరావతి అయితే జీరో నుంచి మొదలుపెట్టాలి. చంద్రబాబు స్కామ్‌ల కోసం ఏపీని ఇబ్బంది పెడుతున్నారు. ప్రజలకు కూడా మావిగన్‌కు మద్దతు పలికారు. అది తట్టుకోలేక చంద్రబాబు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. మంత్రులతో కూడా బూతులు మాట్లాడిస్తున్నారు. రూ.1200 కోట్లతో అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ ఉన్నా మళ్లీ అన్నీ కొత్తగా కడతానం టున్నారు. కొత్తగా నిర్మిస్తున్న 5 బిల్డింగ్‌ల నిర్మాణం పేరుతో చంద్రబాబు దోపిడీ చూస్తే ప్రజలు నివ్వెరపోతున్నారు. భవన డిజైన్లకే రూ.401 కోట్లు. ఈ ఐదు బిల్డింగులకు అయ్యే మొత్తం ఖర్చు రూ. 10,665 కోట్లు.. అంటే ప్రస్తుతం చదరపు అడుగుకు రూ.20,427?. వాటి ఫర్నీచర్, ఇంటీరియర్ ఇంకా అదనపు ఖర్చులన్నమాట.. అంటే చదరపు అడుగుకు రూ.30 వేలు దాటుతుందన్న మాట. మళ్లీ ఇవే నిర్మాణాలకు కొత్త టెండర్లు పిలిచారు.. కానీ, పాత వాళ్లకే ఇచ్చారు. ఫైవ్‌స్టార్ హోటల్స్‌కు కూడా చదరపు అడుగు రూ.4,500 లోపే!. తెలంగాణలో రూ.615 కోట్లతో కేసీఆర్ సచివాలయం కట్టారు. మన సెక్రటేరియట్‌కు మాత్రం ఇంత ఖర్చా? ఎందుకు?. కొత్త అసెంబ్లీ, కొత్త హైకోర్టు అంటూ మళ్లీ భారీగా ఖర్చు చేయబోతున్నారు. ఇదంతా విచ్చలవిడిగా చేస్తున్న దోపిడీనే' అని తెలిపారు. ప్రజల బాగోగులను చంద్రబాబు గాలికి వదిలేశారు. రాష్ట్రాన్ని జంగిల్ రాజ్‌గా మార్చేశారు. ఎవరైనా ప్రశ్నిస్తే కేసులతో అణగదొక్కుతున్నారు. రెండేళ్లలో ఏం మంచి చేశారో చంద్రబాబు చెప్పాలి. ఏపీలో ఎవరిది గొడ్డలి పార్టీ.. ఎవరిది గన్ కల్చర్?. ఎవరివి హత్యా రాజకీయాలని చంద్రబాబును వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ప్రశ్నించారు. శవ రాజకీయాలు.. హత్యా రాజకీయా లపై చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజారెడ్డిని చంపింది టీడీపీ వాళ్లు కాదా?. వైఎస్సార్ విషయంలో ఏం జరిగిందో అసెంబ్లీలో క్లిప్పింగ్‌లు చూడాలని వైఎస్ జగన్ తెలిపారు. ఎవరిది గొడ్డలి పార్టీ.. ఎవరిది గన్ కల్చర్?. ఎవరివి హత్యా రాజకీయాలు.. చంద్రబాబు సమాధానం చెప్పాలి. మా కుటుంబంలో ముగ్గురు బలైపోయారు. హత్యా రాజకీయాలకు మేము బాధితులం. మా తాత, తండ్రి, బాబాయి ముగ్గురు చనిపోయారు. మాపైనే తప్పుడు రాజకీయాలు చేయిస్తున్నారు. మా తాతగారు రాజారెడ్డిని చంపింది టీడీపీ వాళ్లు కాదా? చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే రాజారెడ్డి హత్య జరిగింది. 1999 అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు రాజారెడ్డిగారిని చంపేశారు. వైఎస్సార్‌ను కేవలం పులివెందులకు కట్టడి చేసి, రాజకీయంగా లబ్ధి పొందాలన్నది ఇందులో ఉన్న రాజకీయ కోణం. రాజారెడ్డి కేసులో దోషులను హైదరాబాద్ తెలుగుదేశం పార్టీ సెంట్రల్ ఆఫీసు, ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో పెట్టి, అధికార దుర్వినియోగం చేసి, వారిని రక్షించింది ఎవరు? మరి ఎవరిది క్రిమినల్ బ్రెయిన్?. ఈ కేసులో నిందితులను జైలుకెళ్లకుండా కాపాడారు. ఎవరిది గొడ్డలి పారీ.. చంద్రబాబు చెప్పాలి. మా నాన్న విషయంలోనూ అదే జరిగింది. అసెంబ్లీకి ఎలా వస్తావో చూస్తానని చంద్రబాబు అన్నారు. అవసరమైతే అసెంబ్లీలో క్లిప్పింగ్‌లు చూడాలి. తర్వాత నాలుగు రోజులకే వైఎస్సార్ ప్రమాదంలో చనిపోయారు. మేం బాధితులం. కాని, తిరిగి మాపైనే వీళ్లు తప్పుడు రాజకీయాలు చేస్తున్నారు. మా చిన్నాయన వివేకానందరెడ్డి ఇదే చంద్రబాబుగారి ప్రభుత్వంలో హత్యకు గురైన మాట వాస్తవమైతే, పైగా తానే హత్య చేశానంటూ సాక్షాత్తూ టీవీ లైవ్ షోల్లో చెలరేగిపోయి మాట్లాడిన దస్తగిరి అనే వ్యక్తి ఇవాళ స్వేచ్ఛగా పోలీసుల వత్తాసుతో దర్జాగా కార్లలో తిరుగుతున్నాడు. పైగా చంద్రబాబుకు లాయర్ లూథ్రానే, దస్తగిరికీ లాయర్ లూథ్రానే. మరి ఎవరిది క్రిమినల్ బ్రెయిన్?. రాజకీయ లబ్ధికోసం ప్రలోభాలతో హంతకులను రక్షించడం, నిర్దోషులను హింసించడం. వివేకానందరెడ్డి కేసులో జరుగుతున్నది ఇదే. చంద్రబాబు బావమరిది, వియ్యంకుడు, బాలకష్ణ గన్ పట్టుకుని టపాటపామని ఇద్దరిని కాల్చిపడేయలేదా? మరి ఎవరిది గన్ కల్చర్?. ఈ ఘటన జరిగిన కొన్ని రోజులకే ఆ ఇంట్లో వాచ్‌మెన్‌ను బండరాయితో మోది చంపేశారు?. పాపం ఎన్టీఆర్ కొడుకు హరికష్ణగారు యాక్సిడెంట్‌లో చనిపోతే, పరామర్శ కోసం అని పోయి, కేటీఆర్‌తో పొత్తులపై చంద్రబాబు మాట్లాడాడు. మరి ఎవరివి శవ రాజకీయాలు?. వంగవీటి మోహనరంగాగారు ఒక టైగర్. ఆయన ఎలా చనిపోయారు?. పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని విజయవాడలో నిరాహారదీక్ష చేస్తుంటే, అర్థరాత్రి నరికి చంపేశారు. ఈ ఘటనలో వేళ్లన్నీ చంద్రబాబు వైపే చూపిస్తాయి. జగన్ మంచివాడు కాబట్టే, మా తాతను చంపిన వాళ్లు కూడా ప్రశాంతంగా ఉన్నారు. జగన్ చెడ్డోడు అయితే వాళ్లు ప్రశాంతంగా ఉండేవాళ్లా? జగన్ నైజం ఎలాంటిది? మనస్తత్వం ఎలాంటిది చెప్పడానికి ఇది నిదర్శనం. ప్రజలకు మంచి చేసి పేరు తెచ్చుకోవాలని మా నాన్న నేర్పించాడు. సోషల్ మీడియా పోస్టులపై తన కార్యకర్తలతో తప్పుడు కేసులు పెట్టించి, నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను అడ్డుపెట్టుకుని, ట్విట్టర్, యూట్యూబ్, ఫేస్ బుక్, ఇన్‌స్టా లాంటి హెడ్ క్వార్టర్స్‌కు నేరుగా ఈ పోలీసులే ఆ పోస్టులను డిలీట్ చేయాలని ఆదేశాలు ఇస్తున్నారు. పోలీసులను వాడుకుని అకౌంట్లను బ్లాక్ చేయిస్తున్నారు. పోలీసులు తమ ప్రాథమిక విధులను వదిలేశారు. రాష్ట్రవ్యాప్తంగా విచ్చలవిడిగా కాలేజీల్లో గంజాయి

# పట్టణ ప్రాంతాల్లో రింగ్‌రోడ్లు, బైపాస్‌లు

-మొదటిపేజీ తరువాయి

మంత్రి అన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి నారాయణ వెల్లడించారు. సాధారణ మున్సిపల్ పనులకు మించి ఆధునిక పట్టణాభివృద్ధిపై ఫోకస్ చేశామన్నారు. తాగునీరు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, మురుగు నీటి శుద్ధిపై ప్రభుత్వం ప్రధాన దృష్టి సారించిందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా విశాఖ, మంగళగిరి--తాడేపల్లిలో ప్రజారోగ్యం, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు.



పట్టణాల్లో కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ముందుగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారని మంత్రి తెలిపారు. అర్బన్ చాలెంజ్ ఫండ్ అవకాశాన్ని రాష్ట్రం పూర్తిస్థాయిలో వినియోగించుకుంటుందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అత్యుత్తమ పట్టణ మౌలిక వసతుల రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు. పట్టణాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దేశానికి మోడల్‌గా నిలుస్తుందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. మరోవైపు రాష్ట్రంలో పలు నగరాలు, పట్టణాలకు రింగ్ రోడ్లు, సెమీ రింగ్ రోడ్లు, బైపాస్‌లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. పట్టణాల్లోని రహదారులు వాహన రద్దీతో ఇరుగ్గా మారుతున్నందున ఆ ట్రాఫిక్‌ను తగ్గించేలా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అర్బన్ డీ-కంజెషన్ పాలసీని సద్వినియోగం చేసుకోవాలని యోచిస్తోంది. ఇప్పటికే శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి తొలి సెమీ రింగ్ రోడ్‌ను సాధించింది.

కొడికొండ చెక్‌పోస్ట్ నుంచి లేపాక్షి మీదుగా హిందూపురం పెద్దచెరువుకు ఆవలి వైపు మడకశిర, సిర వరకు జాతీయ రహదారి (544ఇ)ని 10 మీటర్ల వెడల్పుతో విస్తరించారు. దీనివల్ల హిందూపురానికి ఒకవైపు బైపాస్ ఉన్నట్లే! అయితే, పట్టణ శివారులో కర్ణాటక సరిహద్దులో పారిశ్రామిక ప్రాంతం ఉంది. అటునుంచి వచ్చే వాహనాలన్నీ హిందూపురం పట్టణం లోపలి నుంచి ప్రయాణిస్తున్నాయి.

ఇప్పుడు అర్బన్ డీ-కంజెషన్ పాలసీలో భాగంగా ఎన్‌హెచ్-544ఇలో లేపాక్షి వద్ద నుంచి హిందూపురం పారిశ్రామికవాడ మీదుగా, పట్టణానికి రెండో వైపు నుంచి రోడ్ నిర్మించి పరిగి సమీపంలో హైవేకి కలుపుతారు. అంటే, దాదాపు 20 కి.మీ. మేర సెమీ రింగ్ రోడ్ నిర్మించనున్నారు. ఇప్పటికే హైవేని, ఈ సెమీ రింగ్ రోడ్‌ను కలిపితే హిందూపురం చుట్టూరా రింగ్ రోడ్ వచ్చినట్లు అవుతుంది.

**ఇదీ కేంద్రం విధానం**

అర్బన్ డీ-కంజెషన్ విధానంలో భాగంగా పట్టణాల చుట్టూ రింగ్, సెమీ రింగ్, బైపాస్ రోడ్లు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇస్తూ, రాష్ట్ర ప్రభుత్వాన్నీ భాగస్వామిని చేస్తోంది. రోడ్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ వ్యయా న్ని పూర్తిగా లేదా సగమైనా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలి. నిర్మాణ వ్యయంలో కొంత మొత్తాన్ని రాష్ట్రం వెచ్చించాలి. లేదంటే మెటీరియల్స్‌కు సీనరేజ్ ఫీజులు, వివిధ పన్నులు, రాష్ట్ర జీఎస్టీ నుంచి మినహాయింపునివ్వాలి. ఈ రోడ్లకు ఆనుకొని పట్టణ ప్రాంతం అభివృద్ధి చెందితే, దానిద్వారా వచ్చే రాబడిలో కొంత కేంద్రానికి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నిబంధనల్లో వేటికైనా రాష్ట్ర ప్రభుత్వం సమ్మతిస్తే ఆయా రోడ్ల నిర్మాణానికి

# మూడు వస్తే.. మూడేది ఎవరికి

**విజయవాడ :** రాజకీయాల్లో అవకాశాలు రావు, తీసుకోవాలి. ప్రజలు ఎపుడూ తెలివైన వాళ్ళు. వారికి తామే ఆల్టర్నేషన్ అని ఎవరైనా అనుకుంటే అంతకంటే పొరపాటు ఉండదు, ప్రజలు తమదైన చైతన్యంతో తమకు కావాల్సిన ఆల్టర్నేషన్ ని తెచ్చుకుంటారు. గద్దె మీద కూర్చోబెడతారు. దానికి తాజా ఉదాహరణ తమిళనాడు. అక్కడ డీఎంకే ఓడితే అన్నా డీఎంకేనే దిక్కు అనుకున్నారు ఆ పార్టీ నేతలు. కానీ ఫలితాలు వచ్చిన తరువాత సీన్ అర్థం అయింది మూడవ ప్లేస్ లోకి పడిపోయింది. అంటే జనాల ఆలోచనలు ఎంత వేగంగా మారుతాయన్నది అర్థం చేసుకోవాలిన అవసరం ఉంది. ఇదే కాదు దేశాన్ని మూడు నాలుగు దశాబ్దాలకు పైగా ఏకచత్రాధిపత్యంగా ఏలిన కాంగ్రెస్ పార్టీ కూడా చివరికి విపక్షంలోకి రావాల్సి వచ్చింది. ఏపీ లో చూస్తే ప్రస్తుతానికి రాజకీయ వాతావరణం కూటమికి వైసీపీయే ప్రత్యర్థిగా ఉంది. అదే వైసీపీలో ధీమాను కూడా పెంచుతోంది. కూటమి తప్పులు చేస్తే అధికారం తమకే దక్కుతుందని మెచ్చి వరమాలను తమ మెడలో వేస్తారని వైసీపీ నేతలు భావిస్తున్నారు. యాంటీ ఇంకెంబెన్సీ మీదనే ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో మేమే అని చెబుతున్నారు. మరో విషయం ఏమిటి అంటే ఒక పార్టీకి ఒకేసారి అధికారం ఇవ్వడం ఏపీ ప్రజలు చేస్తారు కాబట్టి ఆ ట్రాక్ రికార్డు చూసినా తమకే చాన్స్ అని కూడా వారు విశ్వాసంగా ఉన్నారు.అయితే ఏపీలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా మూడేళ్ళ సమయం ఉంది. రాజకీయంగా చూస్తే అది చాలా ఎక్కువ సమయమే. ఎందుకంటే క్షణాలలో అంతా మారే సీన్ పొలిటికల్ గా ఉంటుంది. అలా చూసినపుడు ఈ మూడేళ్ళలో కొత్త పార్టీ వచ్చినా లేక థర్డ్ ఫోర్స్ ఏదైనా ఎమర్జ్ అయినా ఎవరికి ఎక్కువ నష్టం అన్న చర్చ వస్తోంది. సాధారణంగా మూడవ పార్టీ వస్తే కనుక అది ఖాయంగా ప్రతిపక్ష పార్టీకే చేటు చేస్తుంది. దానికి మళ్ళీ అన్నా డీఎంకేని ఉదహరించాల్సి ఉంటుంది. అందువల్ల ఏపీలో కూడా వైసీపీకే దెబ్బ పడుతుందని అనే వారూ ఉన్నారు. ఏపీలో రెండేళ్ళ కూటమి ప్రభుత్వం పాలనలో అసంతృప్తి ఉంది. అయితే అది ఏ మేరకు అన్నది తెలియడం లేదు కానీ అధికారంలో ఉన్న పార్టీకి సహజం. కానీ ఆ అసంతృప్తి వైసీపీ వైపు మళ్ళడం లేదు. అంటే వైసీపీకి 2024 లో వచ్చిన 40 శాతం ఓట్లు అలా నికార్సుగా నిలిచి ఉన్నాయో లేవో తెలియడం లేదు కానీ కొత్త ఓట్లు అయితే జత చేరడం లేదు అన్న విశ్లేషణలు ఉన్నాయి. మరో వైపు చూస్తే ఏపీలో వైసీపీని వీడిన వారు ఉన్నారు, కూటమిలో చోటు లేని వారు ఉన్నారు. ఇంకా అన్ని పార్టీల తీరు చూసి కొత్తదనం కోసం ఆలోచిస్తున్న వారు ఉన్నారు. వీరందరి కోసం ఏదైనా పార్టీ వచ్చినా లేక ఫోర్స్ గా అందరూ కలిసి ప్రయత్నం చేసినా అపుడు ఏమిటి జరుగుతుంది అన్నది ఒక కీలకమైన చర్చ. అలాంటి సందర్భాలలో కచ్చితంగా వైసీపీకి ఇబ్బంది అవుతుందని అంటున్నారు. వైసీపీ అయితే రెండేళ్ళ కాలంలో జనంలోకి పెద్దగా వచ్చింది లేదు. ఇక అసెంబ్లీ ముఖం ఎమ్మెల్యేలు చూసింది అంతకంటే లేదు. అధినేత జగన్ కూడా జనంలోకి వచ్చే ప్రయత్నం చేయడం లేదు. దాంతో తమ గొంతుకని విపక్షం వినిపించలేకపోతోంది అన్న భావన అయితే మెల్లగా జనంలోకి వెళ్తోంది. సరిగ్గా ఈ సమయంలో సర్దుకుని వైసీపీ దూకుడుగా ముందుకు సాగకపోతే మాత్రం మూడవ పార్టీ అయినా లేదా శక్తి అయినా వస్తే మాత్రం ఆ పార్టీ విజయావకాశాలనే దెబ్బ తీస్తాయన్న విశ్లేషణలు ఉన్నాయి.




## కార్యకర్తే అధినేత

-మొదటిపేజీ తరువాయి

నిలిచేలా టీడీపీ చేపట్టిన విప్లవాత్మక పథకాలపై ఈ వేదికగా విస్తృతంగా చర్చించనున్నారు.

ప్రభుత్వ పథకాల రూపకల్పనలో మహిళల భాగస్వామ్యానికి ఇస్తున్న ప్రాధాన్యతను ప్రజలందరికీ అర్థమయ్యేలా చాటిచెప్పాలని చంద్రబాబు స్పష్టం చేశారు. “కార్యకర్తే పార్టీకి అసలైన అధినేత” అనే బలమైన సందేశం ఈ మహానాడు వేదికగా ప్రతి ఒక్కరికీ చేరాలని దిశానిర్దేశం చేశారు. డిజిటల్, భౌతిక రూపాల కలయికతో హైబ్రిడ్ విధానంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రోజువారీ సమయపాలనకు పెద్దపీట వేస్తూ, రెండు రోజుల పాటు ఉదయం 9 గంటలకే మహానాడు కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. క్షేత్రస్థాయి శ్రేణులను ఉత్తేజితం చేస్తూ ప్రతి ఒక్కరినీ ఈ వేడుకలో భాగస్వాములను చేయాలని అధినేత ఆదేశించారు. మహానాడు నిర్వహణను కేవలం ఒకే ప్రాంతానికి పరిమితం చేయకుండా గ్రామాల్లోని క్లస్టర్ స్థాయిలోనే నిర్వహించాలని పొలిట్ బ్యూరో ఖరారు చేసింది. అన్ని క్లస్టర్లలో తెలుగువారి ఆరాధ్యదైవం, నందమూరి తారకరామారావు విగ్రహాలకు ఘనంగా నివాళు లర్పించి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. మహానాడుకు రెండు రోజుల ముందు నుంచే పండుగ వాతావరణం ప్రతిబింబించేలా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కార్యకర్త, అభిమాని ఇంటిపై టీడీపీ జెండాను రెపరెపలాడించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

**మొత్తం 19 తీర్మానాలకు ఆమోదం**

పార్టీ భవిష్యత్తు కార్యాచరణను నిర్దేశించేలా పొలిట్ బ్యూరో సమావేశంలో మొత్తం 19 తీర్మానాలకు ఆమోదం తెలిపారు. వీటితో పాటు మహానాడులో చర్చకు రానున్న వివిధ అంశాలపై చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. ప్రసంగించే ప్రతి వక్తా తమకు కేటాయించిన అంశంపై పూర్తి నిష్ణాతుడై ఉండాలని, ఎలాంటి సాగతీత లేకుండా, సమయపాలన పాటిస్తూ విషయాన్ని సూటిగా, స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈ మహానాడులో విభిన్న ప్రాంతాల సమస్యలు, రాజకీయ ముఖచిత్రంపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 10, తెలంగాణకు సంబంధించి 4, అండమాన్‌కు చెందిన 1 అంశంతో పాటు ఉమ్మడి అంశాలపై మరో 4 తీర్మానాలను ప్రవేశపెట్టనున్నారు. వీటికి తోడు రెండు రాష్ట్రాల్లోని తాజా రాజకీయ పరిస్థితులు, సవాళ్లపై ప్రత్యేక రాజకీయ తీర్మానం రూపంలో చర్చ జరగనుశీది. పార్టీ ఆవిర్భావం నుంచి జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలు తెలుగుదేశానికి కొండంత అండగా నిలిచారని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా గుర్తుచేశారు. బీసీల సర్వతోముఖాభివృద్ధికి, ఆర్థిక ఎదుగుదలకు పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందనే బలమైన సందేశాన్ని ఈ మహానాడు ద్వారా క్యాడర్‌లోకి పంపనున్నారు. పార్టీకి ఉన్న సాంప్రదాయ ఓటు బ్యాంకును ఎక్కడా చేజారిపోకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలని నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, తీసుకొస్తున్న భారీ పెట్టుబడులు, సాధిస్తున్న ప్రగతిని మహానాడు వేదికగా ప్రజల ముందుకు తీసుకురానున్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ ‘గొడ్డలి పార్టీ’ సాగిస్తున్న కుట్రలను, విధ్వంసకర రాజకీయాలను ఈ వేదికగా ఎండగట్టాలని పొలిట్ బ్యూరో నిర్ణయించింది. “నా దేశం-నా బాధ్యత” నినాదంతో చేపట్టాల్సిన పొదుపు చర్యలపై కూడా ఈ మహానాడులో ప్రత్యేకంగా చర్చించనున్నారు.

## 123 పట్టణాల్లో ‘ఆపరేషన్ క్లీన్ స్వీప్’

**-- ఈ నెల 23 నుంచి జూన్ 20వ తేదీ వరకు అమలు**

**అమరావతి :** ఏపీ ప్రభుత్వం “ఆపరేషన్ క్లీన్ స్వీప్” పేరుతో విస్తృత స్థాయి పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రకటించింది. ఈ కార్యక్రమం ఈ నెల 23 నుంచి జూన్ 20వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని 123 అర్బన్ లోకల్ బాడీస్‌లో అమలు చేయబడుతుంది. స్వర్ణ ఆంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పెరుగుతున్న ప్రజల భాగస్వామ్యాన్ని పట్టణాల్లో కనిపించే పరిశుభ్రతగా మార్చడమే ఈ కార్యక్రమం లక్ష్యంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పరిశుభ్రతను రోజువారీ అలవాటుగా మార్చడం, శాస్త్రీయ వ్యర్థ నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. నాలుగు వారాలుగా రూపొందించిన ఈ కార్యక్రమంలో



ప్రతి వారం ప్రత్యేక లక్ష్యాలతో అమలు చేపడతారు. మొదటి వారంలో రోడ్లు, ప్రజా ప్రదేశాల్లో కనిపించే చెత్త కుప్పలను తొలగించడం, స్పష్టమైన పరిశుభ్రతను మెరుగుపరచడం పై దష్టి ఉంటుంది. రెండవ వారంలో వర్షపు నీటి కాలువలు, నాళాలు మరియు వెనుక వీధులను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టి వర్షాకాలానికి ముందస్తు సిద్ధతను మెరుగుపరుస్తారు. మూడవ వారంలో గహాలు, వాణిజ్య ప్రాంతాల్లో వ్యర్థాల వర్గీకరణను అమలు చేసి, పెద్ద స్థాయి వ్యర్థ ఉత్పత్తిదారులపై నియంత్రణను కట్టుదిట్టం చేస్తారు. నాలుగవ వారంలో పబ్లిక్ టాయిలెట్లు శుభ్రపరచడం, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను పూర్తిగా తొలగించడం జరుగుతుంది. జిల్లా కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపిస్తారు. పట్టణ స్థాయిలో మున్సిపల్ కమిషనర్లు అమలు బాధ్యతలను చేపడతారు. రోజువారీ పర్యవేక్షణ, కేంద్రీకత డేటా సిస్టమ్ ద్వారా నివేదికలు, జియోట్యాగ్డ్ ఫోటోలు ద్వారా పురోగతిని అంచనా వేస్తారు. ఈ సందర్భంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ -- అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం సాధారణ శుభ్రత చర్యలకంటే మించి మిషన్ మోడ్‌లో అమలు చేయబడుతుందని చెప్పారు. ప్రజల ప్రవర్తనలో స్థిరమైన మార్పు తీసుకురావడం, పరిశుభ్రతను దైనందిన జీవితంలో భాగం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని ఆయన తెలిపారు. పరిపాలనా నాయకత్వం, సాంకేతిక పర్యవేక్షణ, ప్రజల భాగస్వామ్యం కలిసివస్తేనే దీని విజయాన్ని సాధించగలమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వబడింది. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు చురుకుగా పాల్గొనేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం రాష్ట్ర స్థాయిలో నిరంతర పర్యవేక్షణలో ఉండి, పనితీరు తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకుంటారు. జూన్ 20న ఈ కార్యక్రమం ముగియనుండగా, రాష్ట్ర స్థాయి పనితీరు నివేదికను చీఫ్ సెక్రటరీకి సమర్పిస్తారు. ఉత్తమ ప్రదర్శన చేసిన జిల్లాలు, పట్టణాలకు గుర్తింపు ఇవ్వబడుతుంది. ఈ కార్యక్రమం ద్వారా పట్టణ పరిశుభ్రతలో దీర్ఘకాలిక మార్పులు తీసుకురావడమే కాకుండా ప్రజల ప్రవర్తనలో మార్పు తీసుకురావడం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని వెల్లడించారు.

## వేడెక్కిన ధర్మవరం రాజకీయాలు

**అనంతపురం :** ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ లక్ష్యంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో స్థానిక రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రభుత్వ విమర్శకులను, ప్రశ్నించే వారిని అణచివేస్తున్నారంటూ మంత్రి సత్యకుమార్‌పై సొంత పార్టీ కూటమి నేతలతో పాటు ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. “సత్యకుమార్.. నీకు దమ్ముంటే నీ పదవికి రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లోకి రా” అంటూ ధర్మవరం స్థానిక నాయకులు సవాల్ విసరడం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.ఈ తాజా రాజకీయ వివాదానికి ప్రధాన కారణం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం జరిగిన ఒక దాడి ఘటన. మంత్రి సత్యకుమార్ నియోజకవర్గంలో అందుబాటులో ఉండటం లేదంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించిన హైకోర్టు న్యాయవాది కె. అంజన్ రెడ్డిపై మంత్రి వ్యక్తిగత సహాయకుడుహరీష్, అనుచరులు దారుణంగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అంజన్ రెడ్డి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ప్రశ్నించే వారిపై ఇలా దౌర్జన్యాలు చేయడం దుర్మార్గమని స్థానిక నేతలు మండిపడుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ లక్ష్యంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో స్థానిక రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రభుత్వ విమర్శకులను, ప్రశ్నించే వారిని అణచివేస్తున్నారంటూ మంత్రి సత్యకుమార్‌పై సొంత పార్టీ కూటమి నేతలతో పాటు ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. “సత్యకుమార్.. నీకు దమ్ముంటే నీ పదవికి రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లోకి రా” అంటూ ధర్మవరం స్థానిక నాయకులు సవాల్ విసరడం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.ఈ తాజా రాజకీయ వివాదానికి ప్రధాన కారణం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం జరిగిన ఒక దాడి ఘటన. మంత్రి సత్యకుమార్ నియోజకవర్గంలో అందుబాటులో ఉండటం లేదంటూ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించిన హైకోర్టు న్యాయవాది కె. అంజన్ రెడ్డిపై మంత్రి వ్యక్తిగత సహాయకుడుహరీష్, అనుచరులు దారుణంగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అంజన్ రెడ్డి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ప్రశ్నించే వారిపై ఇలా దౌర్జన్యాలు చేయడం దుర్మార్గమని స్థానిక నేతలు మండిపడుతున్నారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తూ

**- ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి, వేగవంతమైన సేవలు అందిస్తా**

**- ప్రజల కోసం ప్రతి క్షణం... సమస్యల పరిష్కారమే లక్ష్యం బీటెక్ రవి**





**పులివెందుల కదిలించే వార్త మే21**

సీఎం చంద్రబాబు సమర్థ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా, పారదర్శక పాలన అందిస్తూ ముందుకు సాగుతోంది. గురువారం పులివెందుల టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో పాల్గొని, నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు, వినతులను స్వయంగా స్వీకరించి పరిశీలించాను .ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించడం జరిగింది. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లి, వేగవంతమైన సేవలు అందించడం మన ప్రభుత్వ ప్రధాన ధ్యేయం.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూనే ఉంటాం. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు.

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.**



**వేంపల్లె కదిలించే వార్త మే 21**

భారత మాజీ ప్రధాని,కాంగ్రెస్ పార్టీ మాజీ జాతీయ అధ్యక్షులు, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు, రాజనీతిజ్ఞుడని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కీర్తించారు. గురువారం వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ 35వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ 1985 నుంచి 1991 వరకు ఆరు సంవత్సరాల పాటు ఏఐసిసి అధ్యక్షులుగా రాజీవ్ గాంధీ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. 1984 నుంచి 1989 వరకు ఐదు సంవత్సరాల పాటు భారత ప్రధానిగా దేశానికి ఎనలేని సేవ చేశారు. . జాతి నిర్మాణంలో యువతకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించాలన్న ఉద్దేశంతో ఓటు కనిష్ట వయోపరిమితిని 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించిన యువత పక్షపాతి రాజీవ్ అన్నారు. స్థానిక ప్రభుత్వాలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి మహిళా సాధికారతకు కృషి చేసిన మహిళా పక్షపాతి.. 73, 74 రాజ్యాంగ సవరణ చట్టాల ద్వారా స్థానిక సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి బాట వేసిన దార్శనికుడు. దేశంలో ఎలక్ట్రానిక్, సమాచార విప్లవానికి ఆద్యుడు. ఈనాడు ప్రతి ఒక్కరి చేతిలో టెలిఫోన్ ఉంది అంటే దానికి కారకుడు రాజీవ్.ఈనాడు ప్రతి ఒక్కరి ఇంట్లో టీవీ ఉంది అంటే దానికి కారకుడు రాజీవ్. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబదూరు వద్ద ఎల్ టి టి ఈ ఉగ్రవాదుల దురాగతానికి రాజీవ్ గాంధీ బలైపోయారు. అందుకే మే 21ని ఉగ్రవాద వ్యతిరేక దినంగా జరుపుకుంటున్నామని తులసి రెడ్డి అన్నారు. రాజీవ్ జీవించింది కేవలం 47 సంవత్సరాలు మాత్రమే. ఎన్నాళ్లు జీవించామన్నది కాదు. జీవించిన కాలములో ఏమి చేసాము అన్నది ముఖ్యం. రాజీవ్ గాంధీ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం, అనుసరణీయం,మార్గదర్శకం, స్ఫూర్తిదాయకం అని తులసి రెడ్డి కొనియాడారు.ఈ కార్యక్రమంలో పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గపు కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు బీగాల రామకృష్ణ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్రెడ్డి అలివేలమ్మ, ఉత్తన్న,బద్రీనాథ్,రాఘవయ్య, శేఖర్, శివ నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

**- జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మౌనద్దీన్.**



**వేంపల్లె కదిలించే వార్త మే 21**

వేంపల్లె మండల పరిధిలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ముత్తుకూరు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిప్యూటీ డిఎంహెచ్ఓ) డాక్టర్.ఖాజా మౌనద్దీన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లినిక్‌లోని రికార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలను, మందుల నిల్వలను ఆయన అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు శాతాన్ని, విధులకు వారు సకాలంలో హాజరవుతున్నారా లేదా అనే విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మౌనద్దీన్ మాట్లాడుతూ, వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దోమకాటు వలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి ప్రమాదకరమైన వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, వీటి పట్ల ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం, ఒంటి నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని హెల్త్ క్లినిక్ లేదా ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి ఉచితంగా వైద్య సేవలు పొందాలని ఆయన కోరారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాల్లో దోమల నివారణకు పంచాయతీ సిబ్బంది సహకారంతో యాంటీ లార్వా పిచికారీ చర్యలు ముమ్మరం చేస్తామని ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం 'డ్రై డే' గా పాటించాలని, ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నాము అని, ప్రజలు దోమతెరాలు వాడాలి అని ప్రజల్లో అంటువ్యాధుల పట్ల అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నరేష్, ఆరోగ్య కార్యకర్త నాగలక్ష్మి దేవి, పాల్గొన్నారు.

# విజయవాడ అధిక ఫీజులను అరికట్టాలి..

**- కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాల వ్యాపారాన్ని అరికట్టాలి..**

**- పి ఎస్ యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శుల డిమాండ్**




**కడప మే 21 కదిలించే వార్త**

విజయవాడలోని ఆర్.ఎస్.పి పార్టీ కార్యాలయంలో పి ఎస్ యు విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శిలు మంజుల సుబ్బరాయుడు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రుల పై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలలు విద్యార్థులను బలవంతంగా తమ సంస్థలలోనే పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు కొనుగోలు చేయించే విధానం పూర్తిగా అన్యాయమని తెలిపారు బుక్ స్టాల్ లో తక్కువ ధరలకు లభించే పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రుల నుంచి డబ్బులను దోచుకుంటున్నారని విమర్శించారు. విద్య హక్కు కాగా, కార్పొరేట్ సంస్థలు దానిని లాభాల వ్యాపారంగా మార్చడం దారుణమన్నారు. ప్రతి సంవత్సరం అడ్మిషన్ల సమయంలో పుస్తకాల పేరుతో వేల రూపాయలు వసూలు చేయడం వల్ల మధ్యతరగతి, పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న పుస్తకాల వ్యాపారాన్ని అరికట్టాలని,ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులను ఒకే దుకాణం నుంచి పుస్తకాలు కొనుగోలు చేయాలని బలవంతపెట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు.అలాగే విద్యా హక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేసి, ఫీజులు మరియు ఇతర వసూళ్లపై నియంత్రణ తీసుకురావాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో వ్యాపారం చేసే కార్పొరేట్ సంస్థలపై ప్రభుత్వం ప్రత్యేక విచారణ జరపాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అయ్యన్న. మొండి నందకిషోర్, అయ్య స్వామి, హరి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వి ఆర్ ఎస్ ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రారంభోత్సవం...

**- జనసేన జిల్లా నాయకుడు తుంగ రమణయ్య**



**కడప మే 21 కదిలించే వార్త** కడప నగరంలోని స్థానిక వై జంక్షన్ లో వి ఆర్ ఎస్ ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయం ను ముఖ్యఅతిథిగా జనసేన జిల్లా నాయకులు తుంగ రమణయ్య హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా తుంగ రమణయ్య మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులు చదువుకు దూరమైన వారికి వి ఆర్ ఎస్ ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో పదవ తరగతి. ఇంటర్మీడియట్. డిగ్రీ. ఆపై చదువుతున్న విద్యార్థులకు అతి తక్కువ ఫీజుకు ఓపెన్ యూనివర్సిటీల ద్వారా శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. కావున జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వి ఆర్ ఎస్ ఆర్ ఆధ్వర్యంలో బీటెక్ చదవాలనుకున్న విద్యార్థులకు ఉచితంగా ఆంధ్రప్రదేశ్ లో కొన్ని కళాశాలలో దగ్గరుండి మేమే కళాశాలలో జాయిన్ చేపించి విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో. వి ఆర్ ఎస్ ఆర్ సొసైటీ సభ్యులు, విద్యావేత్తలు. వేపారవేత్తలు. విద్యార్థులు పాల్గొన్నారు.

# శిరిడి సాయిబాబాకి విశేష పూజలు

**- ప్రత్యేక అలంకరణలో సాయినాధుడు**



పులివెందుల అర్బన్ కదిలించే వార్త మే 21

పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపంలో మొట్టమొదటిగా కొలువైన శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం షిరిడి సాయిబాబా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయాస్తమాన స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో సాయినాధునికి ఉదయం కాగడ హారతి, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి, తదితర పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు . మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్నం హారతి సాయంకాలం 6 గంటలకు సంధ్య హారతి రాత్రి 9 గంటలకు శేజ హారతులు స్వామివారికి అర్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గురువారం ఆలయంలో భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాలు విశేషంగా నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ప్రతి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతోందని తెలియజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు

# ఐడీసీఏ టి 20 ఛాంపియన్ షిప్ ట్రోఫీకి బిల్ల రాజు ఎంపిక




కడప మే 21: కదిలించే వార్త ఇండియన్ డెఫ్ క్రికెట్ అసోసియేషన్ తరపున ఢిల్లీలో జరగనున్న ఐడీసీఏ టి 20 ఛాంపియన్ షిప్ ట్రోఫీకి ఆంధ్రప్రదేశ్ తరపున కడప జిల్లా మరి యాపురానికి చెందిన బిల్ల రాజు ఎంపిక అయ్యాడు. ఈ టోర్నమెం ట్స్ మే 26 నుండి 29 వరకు ఢిల్లీలో జరగనున్నాయి. రాజు ఇండియా డెఫ్ట్ క్రికెట్ టీమ్ కు ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వకారణమని కడప డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ వారితో పాటు మిత్రులు, బంధువులు, క్రీడా అభిమానులు అభినందించారు.

# తుడా చైర్మన్‌గా ఏడాది పూర్తి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి



తిరుపతి రూరల్ కదిలించే వార్త 21 మే

తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా, తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి గురువారం తుడా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.పచ్చదనాన్ని పెంపొందించడానికి, పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి తుడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని చైర్మన్ తెలిపారు.అందులో భాగంగానే ఈ మైలురాయిని స్వయంగా మొక్కలు నాటే కార్యక్రమంతో ప్రారంభించినట్లు పేర్కొని,ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తుడా ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ప్లానింగ్ అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ 43వ పుట్టినరోజు వేడుకలు.




వేంపల్లె కదిలించే వార్త మే 21 జూనియర్ ఎన్టీఆర్ 43వ పుట్టినరోజు వేడుకలను వేంపల్లెలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. వేంపల్లె మండల అధ్యక్షుడు దస్తగిరి, భరత్, కుట్టి ఆధ్వర్యంలో బుధవారం కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది.ఎన్టీఆర్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఆయనపై ఉండాలని అభిమానులు ఆకాంక్షించారు.అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లా బాలాజీ ,లక్ష్మణ్, ప్రవీణ్, సుభహాన్, శివ, గంగరాజు, నరసింహ, సాయి గణేష్, డి శివ,శ్రీకాంత్, బదుల్లా,మాలిక్ ,క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 24న వేంపల్లెలో మెగా ఉచిత వైద్య శిబిరం.



వేంపల్లె కదిలించే వార్త మే 21

వేంపల్లెలోని గండి రోడ్డులో ఉన్న డాక్టర్ బాష ఆసుపత్రిలో ఈనెల 24వ తేది ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ ఎస్ ఎఫ్ బాష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో వేంపల్లెలోని డాక్టర్ బాష హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24 వ తేది ఉదయం 9 గంటల నుండి 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం ఉంటుందని చెప్పారు. కడప పట్టణానికి చెందిన క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ వంశీ విహరీ హజరు అవుతున్నట్లు తెలిపారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు, షుగర్, బిపి, థైరాయిడ్, పక్షపాతం వ్యాధులకు సూచనలు కూడ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఉచిత వైద్య శిబిరం నందు బిపి, షుగర్ వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వేంపల్లె పరిసర ప్రాంతాల్లో ఉన్న రోగులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత వైద్య శిబిరంకు వచ్చే ప్రజలు ముందుగా డాక్టర్ ఎస్ఎఫ్ బాష ఆసుపత్రిలో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

# ఇవ్వగలం నినాదం నేడు దళిత నిరుద్యోగుల స్మశాన వైరాగ్యం

**- దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కైపు రామాంజనేయులు**

**కడప మే 21 కదిలించే వార్త** యువగళం సాక్షిగా ఇచ్చిన 'యువశక్తి' హామీలు ఏమయ్యాయి? దళిత నిరుద్యోగుల ఆశల మీద నీళ్లు చల్లారు ? విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు, కూటమి ప్రభుత్వానిపై 'దళిత మిత్ర సంఘం' వ్యవస్థాపక అధ్యక్షులు కైపు రామాంజనేయులు మండిపడ్డారు. గురువారం ఈ సందర్భంగా కడప నగరం దళిత మిత్ర సంఘం కార్యాలయంలో ఆయన మీడియాతోయువగళం నినాదం నేడు దళిత నిరుద్యోగుల స్మశాన వైరాగ్యం!కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లవుతున్నా యువతకు, ముఖ్యంగా దళిత యువతకు ఇచ్చిన హామీలను నట్టేట ముంచడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు."నాడు పాదయాత్రలో లోకేష్ బాబు అడుగుల్లో అడుగులు వేసి, మీ పిలుపు నమ్మి, తమ బతుకులు మారతాయని ఆశపడ్డ ఆంధ్రప్రదేశ్ యువతకు నేడు మిగిలింది కేవలం నిరాశ, నిస్పృహలు మాత్రమే! 'మహాప్రభో.. మాకు ఉద్యోగాలివ్వండి, మా ఆకలి చల్లార్చండి' అని వేడుకున్న యువతను పట్టించుకోకుండా ఉండటం మీ నైజమా?" అని గట్టిగా ప్రశ్నించాడు.ఒక్కో నిరుద్యోగి ఇంట్లో పొయ్యి వెలుగుతోందో లేదో తెలియదు. చదువుల కోసం కన్నవారు చేసిన అప్పులు తీరక, చేతిలో రూపాయి రాక, వయసైపోతున్నా పెళ్లిళ్లు కాక, ముసలి తల్లిదండ్రులకు మందులు కూడా కొనలేక లోలోపల ఏడుస్తూ, ఆత్మహత్యల అంచున కొట్టుమిట్టాడుతున్న యువత కన్నీటి ఆవేదన, గుండెల నిండా ఉన్న కసి ఈ ప్రభుత్వానికి వినిపించడం లేదని నిలదీశారు. దళిత యువత గుండె కోత. ఎస్సీ, ఎస్టీ సబ్-ప్లాన్ నిధులు ఏ దోపిడీకి గురవుతున్నాయి?రాష్ట్రంలో దళిత యువత పరిస్థితి అత్యంత దారుణంగా మారిందని, సమాజంలో అన్ని రకాలుగా వెనుకబడి, కేవలం చదువును నమ్ముకుని, బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలతో పైకి రావాలనుకున్న ఎస్సీ, ఎస్టీ యువకులను ఈ ప్రభుత్వం నమ్మించి గొంతు కోసిందని మండిపడ్డారు.కనుమరుగైన స్వయం ఉపాధి పథకాలు దళితులు సొంతంగా వ్యాపారాలు చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతారంటూ కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే సబ్సిడీ రుణాలు ఏమయ్యాయి? ఎస్సీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసి దళిత యువతను భిక్షగాళ్లలా రోడ్డుపై నిలబెడతారా? దళిత విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు, ఉపాధి పథకాలకు ఖర్చు పెట్టకుండా ఎటు దారి మళ్లిస్తున్నారన్నారు. దళితుల పొట్టకొట్టి ఆ బడ్జెట్‌ను ఇతర పథకాలకు మళ్లించడం దళిత జాతిపై జరుగుతున్న సామాజిక అత్యాచారం కాదా? బ్యాక్‌లాగ్ పోస్టుల ఊసేది? ఏళ్ల తరబడి మూలనపడ్డ ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ప్రభుత్వ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌ను ఎందుకు తొక్కిపెట్టారు? ఆ పోస్టులను భర్తీ చేస్తే వేల దళిత కుటుంబాల్లో వెలుగులు వస్తాయి కదా, ఆ వెలుగులు చూడటం ఈ పాలకులకు ఇష్టం లేదా? 20 లక్షల ఉద్యోగాలు రూ. 3000 నిరుద్యోగ భృతి.. అంతా పచ్చి అబద్ధమన్నారు. ఎన్నికల ప్రచారంలో, సూపర్-6 హామీలలో నిరుద్యోగులకు నెలకు రూ. 3,000 ఇస్తామని చెప్పి ఇప్పుడు మొహం చాటేయడం పచ్చి ద్రోహమన్నారు. ఆ ముప్పై వందల రూపాయలు వస్తే కనీసం పుస్తకాలకో, కోచింగ్‌లకో, ఇళ్లల్లో పూట గడవడానికో ఉపయోగపడతాయని ఆశపడ్డ యువత కడుపు కొడుతున్నారని ఆవేదన చెందారు. ప్రభుత్వం వచ్చి ఇన్ని రోజులైనా ఆ 'నిరుద్యోగ భృతి' ఊసే ఎత్తకపోవడం నమ్మకద్రోహం కాదా అని ప్రశ్నించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ కేవలం ఓట్ల కోసమేనా అని, ఇటీవల విడుదల చేసిన అరకొర, తుస్సుమన్న నోటిఫికేషన్లతో లక్షలాది మంది నిరుద్యోగుల ఆకలి తీరుతుందా అని నిలదీశారు.మా ఆగ్రహం



మీ పతనానికి దారి తీయకముందే మేల్కొనండి! ఐటీ, విద్యాశాఖ మంత్రిగా ఉంటూ యువతకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఫోజులిచ్చే నారా లోకేష్ బాబు యువగళంలో మీరు కార్చిన కన్నీరు నిజమైతే, నిరుద్యోగులపై మీకు అంత ప్రేమ ఉంటే వెంటనే మా డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఇకపై కాలయాపన చేయకుండా అర్హులైన ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ. 3,000 నిరుద్యోగ భృతిని బకాయిలతో సహా అకౌంట్లలో వెయ్యాలి. ప్రభుత్వ రంగంలో ఉన్న ఖాళీలన్నింటితో కూడిన అసలైన 'మెగా జాబ్ క్యాలెండర్'ను తక్షణమే ప్రకటించాలి.యువత కళ్లల్లో వస్తున్న కన్నీరు.. రేపు కూటమి ప్రభుత్వానికి ఊపిరాడకుండా చేసే అగ్నిపర్వతంలా మారుతుందని దళిత మిత్ర సంఘం తీవ్రంగా హెచ్చరించింది. నిరుద్యోగుల ఆకలి కేకలు, దళిత యువత ఆక్రందనలు పట్టించుకోకపోవడం బాధాకరం ఇప్పటికైనా మేల్కొని దళిత యువత బాధలు పట్టించుకోండన్నారు. ఈ కార్యక్రమంలో దళిత మిత్ర రాష్ట్ర యువజన అధ్యక్షుడు మురహరి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు..

**- డీసీసీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన**

**- డీసీసీ అధ్యక్షురాలు విజయ జ్యోతి**

**కడప, మే 21 కదిలించే వార్త**

భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం కడపలోని డీసీసీ కార్యాలయంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి ఆధ్వర్యంలో డీసీసీ కార్యాలయ ప్రాంగణంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా విజయ జ్యోతి విలేకరులతో మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని పరిచయం చేసిన దూరదృష్టి కలిగిన నాయకుడని కొనియాడారు. యువతకు ఓటు హక్కు వయస్సును 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించడం, కంప్యూటర్ మరియు టెలికాం రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేయడం వంటి ఎన్నో సంస్కరణలను ఆయన చేపట్టారని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ 1944 ఆగస్టు 20న జన్మించి, 1984లో భారతదేశ అత్యంత యువ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. దేశాన్ని 21వ శతాబ్దం వైపు తీసుకెళ్లాలనే దూరదృష్టితో సమాచార సాంకేతిక రంగ అభివృద్ధికి బాటలు వేసిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబుదూర్ వద్ద జరిగిన దుర్ఘటనలో ఆయన మరణించడం దేశానికి తీరని లోటని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలను కొద్దిమంది పారిశ్రామికవేత్తలకు తాకట్టు పెట్టిన మోదీ, అమిత్ షా లు ద్రోహులు అన్నారు. పశ్చిమ ఆసియా యుద్ధ ఉద్రిక్తత ల కారణంగా చమురు వినియోగం తగ్గించుకోవాలని మోదీ పొదుపు చర్యలు సూచించారన్నారు. కానీ అంబానీ మాత్రం తన చమురును బయట దేశాలకు ఎగుమతి చేస్తూ ఆ వచ్చిన డబ్బును ఫండ్ గా మోడీకి



ఇస్తున్నారని విజయ జ్యోతి విమర్శించారు. పెద్ద నోట్ల రద్దు, కోవిడ్ కష్టాల నుంచి దేశంలో చమురు సంక్షేమం వరకు... ప్రతిదానికి మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ లదే బాధ్యతను విమర్శించారు. దేశాన్ని భయంకరమైన ఆర్థిక సంక్షోభం ముంచెత్తనున్నదని విజయ జ్యోతి మరోసారి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుభాన్ బి, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీనివాసులు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మూరతోటి విజయకుమార్, నందిమండలం సుశీల్ కుమార్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్ బాషా, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఆర్టిఐ విభాగం ఉపాధ్యక్షులు కోటపాటి లక్ష్మయ్య, జవహర్, బాలమంచు, జిల్లా అధ్యక్షులు పుల్లూరు భాష, నందిమండలం వెంకటసుబ్బయ్య, షామీర్ హుస్సేన్, షబానా, శీలం గంగయ్య, హరిప్రసాద్, హమీద్, జహీర్ గౌస్, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంలో ప్రగతి పథంలో

**- తుడా ను రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపాం చైర్మన్ దివాకర్ రెడ్డి**

**- చెప్పిన పనిని చేసి చూపించడమే నా లక్ష్యం.**

**- అందరి సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లోనే 'తుడా'ను నంబర్ వన్ స్థానంలో ఉంచడమే లక్ష్యం**

**తిరుపతి కదిలించే వార్త 21 మే**

తిరుపతి లో తుడా కార్యాలయంలో ఏడాది పాలనపై ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ప్రెస్ మీట్ విజయవంతమైన ఏడాది కాలానికి గాను గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి శ్రీ నారా లోకేష్ ఆయన ప్రత్యేక శుభాభినందనలు తెలియజేశారు. తుడా పూర్వ చైర్మన్‌లందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. గడిచిన ఏడాది కాలంలో అభివృద్ధే ధ్యేయంగా, పారదర్శక పాలనతో తుడా అపూర్వమైన మైలురాళ్లను అధిగమించి ప్రగతి పథంలో దూసుకుపోతోంది" అని తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు రాష్ట్ర ప్రభుత్వ పెద్దల సహకారంతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జఠిలమైన సమస్యలను పరిష్కరిస్తూ, తుడా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఆయన వెల్లడించారు. ఈ ప్రెస్ మీట్ సందర్భంగా తుడా ఛైర్మన్ ఏడాది కాలంలో సాధించిన విజయాలు, ప్రగతి నివేదికలోని ముఖ్యాంశాలను వివరించారు.దాదాపు ఐదు దశాబ్దాలుగా నలుగుతున్న శెట్టిపల్లి భూ బాధితుల సమస్యకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే శాశ్వత పరిష్కారం చూపడం జరిగిందని,సీఎం ఆదేశాల మేరకు పేద లబ్ధిదారులపై పైసా భారం పడకుండా సుమారు రూ.17.50 కోట్ల రిజిస్ట్రేషన్ ఫీజును ప్రభుత్వమే పూర్తిగా మాఫీ చేసిందని తెలిపారు. ఈ-డిప్ లాటరీ విధానం ద్వారా అత్యంత పారదర్శకంగా 1,711 మంది లబ్ధిదారులకు (1432 హౌస్ సైట్లు, 279 అగ్రికల్చర్ సైట్లు) భూ కేటాయింపులు జరిపి, ఉచితంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. తుడా ఏర్పడి 81 సంవత్సరాలు అవుతున్నా, ఈ ఒక్క ఏడాదిలోనే రికార్డు స్థాయిలో 400 ఎకరాల ల్యాండ్ పూలింగ్ చేశామని, దీని ద్వారా తుడా సంస్థకు రూ. 400 నుంచి 500 కోట్ల ఆదాయం సమకూరతున్నట్టు తెలిపారు. తిరుపతి పరిసర ప్రాంతాల జీవనాడి అయిన స్వర్ణముఖి నదిని కాపాడుకోవడానికి "ఆపరేషన్ స్వర్ణ" కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి వేగవంతం చేశామని అన్నారు. నది పరివాహక ప్రాంతాల్లో అక్రమ ఆక్రమణలను అడ్డుకుంటూ, పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి మరియు భూగర్భ జలాల పెంపుదలకు తుడా నిరంతరం శ్రమిస్తోందన్నారు. తుడా పరిధిలోని 9 నియోజకవర్గాల అభివృద్ధికి సమానంగా సానుకూలత చూపిస్తూ, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లానని,మిగిలిన నియోజకవర్గాల ప్రజలు కూడా తుడా పరిధిలోకి రావాలని ఎదురుచూస్తున్నారని తెలిపారు. తిరుపతి నగర ప్రజలకు, వచ్చే యాత్రికులకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా చేయడమే మా ప్రధాన ధ్యేయమని,ఇందులో భాగంగా ఉప్పరపల్లి పరిధిలో ప్రధాన రహదారి విస్తరణ, అధునాతన డ్రైనేజీ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు.అలాగే తెలుగు గంగ పైప్‌లైన్ తరలింపు పనులను కూడా తుడా నిధులతో సమన్వయం చేసుకొని రహదారుల నిర్మాణాన్ని సుగమం చేస్తున్నామని తెలిపారు. ఏడాది కాలంలో 3 బోర్డు సమావేశాలు, అభివృద్ధిపై 30 ప్రత్యేక సమావేశాలు, కలెక్టరేట్‌లో 12 సమీక్షా సమావేశాలు



నిర్వహించడంతో పాటు స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టానని తెలిపారు. పర్యావరణాన్ని మెరుగుపరచడానికి అవిలాల చెరువు సుందరీకరణ మరియు అభివృద్ధి పనులను వేగవంతం చేశామని,చెరువు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, సాగునీటి శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నీటి ప్రవాహ నిర్వహణను క్రమబద్ధీకరిస్తున్నమ న్నారు. తుడాపై నమ్మకంతో ప్రజలు ముందుకు రావడంతో 1,500 ఎకరాలకు అప్రూవల్స్ ఇచ్చామని, మంచి హోటళ్ల అభివృద్ధికి కూడా అనుమతులు మంజూరు చేశామన్నారు. గడిచిన ఈ ఏడాది కాలం కేవలం ఆరంభం మాత్రమే. తుడా పరిధిలోని ప్రతి గ్రామం,ప్రతి వార్డు అభివృద్ధి చెందేలా మా సిబ్బంది, అధికారులు రాత్రింబగళ్లు కష్టపడుతున్నారు.తుడా అభివృద్ధి నమూనాపై దేశ రాజధాని ఢిల్లీలో ప్రత్యేక ప్రెజెంటేషన్ ఇచ్చామని,జపాన్, సౌత్ కొరియా, యూకే వంటి అంతర్జాతీయ దేశాల పర్యటనల్లో సైతం తుడా అభివృద్ధిపై ప్రశంసలు దక్కాయన్నారు.నిరంతరం సహకరిస్తున్న స్థానిక ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. తుడా ఛైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు.

# వాహన దారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలి.

**- ఎస్ఐలు తిరుపాల్ నాయక్, తాహిర్ హుస్సేన్.**

**వేంపల్లె కదిలించే వార్త మే 21**

వాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని అలాగే ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ లు తిరుపాల్ నాయక్, తాహిర్ హుస్సేన్ లు హెచ్చరించారు. గురువారం నందిపల్లి ప్రాంతంలో వారి సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన పత్రాలు, ఇన్సూరెన్స్ పత్రాలు, లైసెన్స్ లేని వారికి జరిమానాలు విధించారు. అనంతరం వారు వాహనదారులకు పలు సూచనలు, సలహాలు జారీ చేశారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వాహనం నడపాలని అన్నారు. వాహనాల వెంట రికార్డులు తప్పని సరిగా ఉంచుకోవాలని అన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. నిబంధనలు ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో



పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టణంలో విస్తృత ఫుల్ పెట్రోలింగ్.

**- ఎస్ఐలు తిరుపాల్ నాయక్, తాహిర్ హుస్సేన్.**



వేంపల్లె కదిలించే వార్త మే 21

వేంపల్లె పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం కలిగించేలా వాహనాలు రోడ్లపై పెడితే అలాంటి వారికి ట్రాఫిక్ చలానాలు మరియు కఠిన చర్యలు తప్పవని వేంపల్లె యస్ ఐ లు తిరుపాల్ నాయక్, తాహిర్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా వేంపల్లె లో ట్రాఫిక్ పై ప్రత్యేక దృష్టి సాధించారు. వేంపల్లెలోని బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ నుండి నాలుగు రోడ్ల కూడలి ప్రాంతంలో మరియు స్టేట్ బ్యాంకు వరకు అంతరాయం కలిగించేలా రోడ్లపై వాహనాలు నిలిపిన, ట్రాఫిక్ అంతరాయం కలిగించేలా బోర్డులు,బైకులు, తోపుడు బండ్లు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల వద్ద మోటార్ బైకులు కూడా క్రమ పద్ధతిలో రాకపోకలకు అందరం కలగకుండా పార్కింగ్ చేసుకోవాలన్నారు. రోడ్డు పనులు జరుగుతున్న కారణంగా ప్రజలు అందరూ సహకరించాలని కోరారు.

## ఎస్వీ గోశాలలో నెయ్యి తయారీ కేంద్రం పనుల పరిశీలన

**- జూలై నాటికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, నెయ్యి తయారీ కేంద్రం పనులు పూర్తి చేయాలి టిటిడి జేఈవో వైద్యం, విద్య డా.ఎ. శరత్**

తిరుపతి రూరల్ కదిలించే వార్త 21 మే



తిరుపతిలోని టిటిడి ఎస్వీ గోశాలలో నిర్మాణంలో ఉన్న నెయ్యి తయారీ కేంద్రం, సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ పనులను టిటిడి జేఈవో వైద్యం, విద్య డా. ఎ. శరత్ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, టిటిడి ఈవో ఎం. రవిచంద్ర ఆదేశాల మేరకు పెండింగ్ పనులను సమీక్షించామని తెలిపారు. నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో చేపడుతున్న సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ పనులను మరియు చివరి దశలో ఉన్న నెయ్యి తయారీ కేంద్రం పెండింగ్ పనులు జూలై నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్వీ గోశాలలో రోజుకు సుమారు 2 వేల లీటర్ల పాలను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్వీ గోశాల నుండి సేకరించే పాలను వినియోగించి స్వామివారి కైంకర్యాలు, సేవల కోసం పాలు, పెరుగు, నెయ్యి తదితర ఉత్పత్తులను టిటిడి స్వయంగా తయారు చేసేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.అదేవిధంగా, నెయ్యి తయారీ ప్లాంట్ పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయని, వెంటనే ట్రయల్ రన్ నిర్వహించి మిగిలిన పనులను పూర్తి చేయాలని సూచించారు. పాలు ఇచ్చే దేశీయ ఆవులను మరింతగా సమీకరించేందుకు చర్యలు చేపట్టాలని, టిటిడి తరఫున చేపట్టాల్సిన నీరు, విద్యుత్, ఫ్యాన్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, లైటింగ్, సైన్ బోర్డులు తదితర మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా మజ్జిగ, వెన్న తయారీ అనంతరం వెన్న నుండి నెయ్యి ఉత్పత్తి చేసే ప్రక్రియలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్వామివారి ధూప, దీప, నైవేద్య కార్యక్రమాలకు వినియోగించే నెయ్యిని ఎస్వీ గోశాల నుండే సరఫరా చేసేలా పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ యూనిట్ ద్వారా రోజుకు 2 వేల లీటర్ల పాల నుండి సుమారు 80 కిలోల నెయ్యి తయారు చేసే అవకాశం ఉందని, దశలవారీగా యూనిట్ సామర్థ్యాన్ని 10 వేల లీటర్ల వరకు పెంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జేఈవో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఎస్వీ గోశాల డైరెక్టర్ డా. ఏవీఎన్ శివకుమార్, ఎస్ఈలు వేంకటేశ్వర్లు, మనోహరం, ఈఈ శ్రీ ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారునికి ఈ -ఆటోను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్ కదిలించే వార్త 21 మే



తిరుపతిలో కలెక్టరేట్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారునికి గురువారం స్థానిక కలెక్టరేట్ నందు మెప్మా వారి ఆధ్వర్యంలో సురేంద్ర అను లబ్ధిదారునికి ఈ -ఆటోను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పంపిణీ చేసారు. మార్చి 30న నాయుడుపేటలో నిర్వహించిన టిడ్కో గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఇచ్చిన హామీ మేరకు, మెప్మా ఆధ్వర్యంలో నాయుడుపేటకు చెందిన లబ్ధిదారుడు అయిన సురేంద్రకు రూ.3.52 లక్షల విలువ గల ఈ -ఆటోను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు.ఇంటికొక్క పారిశ్రామిక వేత్త లో భాగంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు స్వయం ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవనోపాధిని మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు.ఈ -ఆటోను అందుకున్న సురేంద్ర గౌ,,ముఖ్యమంత్రి వర్యులకు మరియు జిల్లా కలెక్టర్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆటో ద్వారా తన కుటుంబానికి స్థిరమైన ఆదాయం సమకూరుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డిఓ దేవేందర్ రెడ్డి, మెప్మా పీడీ జాల ఎఫ్రాయిమ్, నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఫజిలుల్లా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కడప ఎయిర్‌పోర్ట్‌లో యువనేత నారాలోకేష్ కు ఘన స్వాగతం.



పులివెందుల కదిలించే వార్త మే 21

కడప జిల్లా పర్యటన నిమిత్తం విచ్చేసిన టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రివర్యులు నారా లోకేష్ ను కడప పార్లమెంట్ తెలుగు యువత ప్రధానకార్యదర్శి అక్కులుగారి విజయ్ కుమార్ రెడ్డి విమానాశ్రయంలో స్వాగతం పలకడం జరిగింది అన్నారు.టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన తర్వాత తొలిసారి కడపకు విచ్చేసిన లోకేష్ కు ఎయిర్‌పోర్ట్ వద్ద పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై ఘన స్వాగతం పలికారు అన్నారు.

# ఎస్వీ గోశాలలో నెయ్యి తయారీ కేంద్రం పనుల పరిశీలన

**- జూలై నాటికి సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్, నెయ్యి తయారీ కేంద్రం పనులు పూర్తి చేయాలి టిటిడి జేఈవో వైద్యం, విద్య డా.ఎ. శరత్**

**తిరుపతి రూరల్ కదిలించే వార్త 21 మే**

తిరుపతిలోని టిటిడి ఎస్వీ గోశాలలో నిర్మాణంలో ఉన్న నెయ్యి తయారీ కేంద్రం, సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ పనులను టిటిడి జేఈవో వైద్యం, విద్య డా. ఎ. శరత్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, టిటిడి ఈవో ఎం. రవిచంద్ర ఆదేశాల మేరకు పెండింగ్ పనులను సమీక్షించామని తెలిపారు. నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో చేపడుతున్న సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ పనులను మరియు చివరి దశలో ఉన్న నెయ్యి తయారీ కేంద్రం పెండింగ్ పనులు జూలై నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్వీ గోశాలలో రోజుకు సుమారు 2 వేల లీటర్ల పాలను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్వీ గోశాల నుండి సేకరించే పాలను వినియోగించి స్వామివారి కైంకర్యాలు, సేవల కోసం పాలు, పెరుగు, నెయ్యి తదితర ఉత్పత్తులను టిటిడి స్వయంగా తయారు చేసేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అదేవిధంగా, నెయ్యి తయారీ ప్లాంట్ పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయని, వెంటనే ట్రయల్ రన్ నిర్వహించి మిగిలిన పనులను పూర్తి చేయాలని సూచించారు. పాలు ఇచ్చే దేశీయ ఆవులను మరింతగా సమీకరించేందుకు చర్యలు చేపట్టాలని, టిటిడి తరఫున చేపట్టాల్సిన నీరు, విద్యుత్, ఫ్యాన్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, లైటింగ్, సైన్ బోర్డులు తదితర మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా మజ్జిగ, వెన్న తయారీ అనంతరం వెన్న నుండి నెయ్యి ఉత్పత్తి చేసే ప్రక్రియలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్వామివారి ధూప, దీప, నైవేద్య కార్యక్రమాలకు




వినియోగించే నెయ్యిని ఎస్వీ గోశాల నుండే సరఫరా చేసేలా పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ యూనిట్ ద్వారా రోజుకు 2 వేల లీటర్ల పాల నుండి సుమారు 80 కిలోల నెయ్యి తయారు చేసే అవకాశం ఉందని, దశలవారీగా యూనిట్ సామర్థ్యాన్ని 10 వేల లీటర్ల వరకు పెంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జేఈవో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఎస్వీ గోశాల డైరెక్టర్ డా. ఏవీఎన్ శివకుమార్, ఎస్ఈలు వేంకటేశ్వర్లు, మనోహరం, ఈఈ శ్రీ ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు స్మగ్లర్లకు జైలు శిక్ష.

**- ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు తీర్పుతో నిందితులకు రెండేళ్ల కారాగార శిక్ష, రూ.20,000 జరిమానా.**

**- గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా నేరం రుజువు చేసిన తిరుపతి జిల్లా పోలీసులు.**

**- అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతుందని జిల్లా ఎస్పీ హెచ్చరిక.**



**తిరుపతి క్రైమ్ కదిలించే వార్త 21** మేతిరుపతి జిల్లా : 2014 సంవత్సరంలో యర్రావారిపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని శేషాచలం రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమంగా ప్రవేశించి ఎర్రచందనం చెట్లను నరికి రవాణా చేస్తున్న నిందితులను అప్పటి యర్రావారిపాలెం ఎస్ఐ శ్రీ ఎస్. రహీముల్లా మరియు సిబ్బంది అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన తిరుపతి జిల్లా ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి శ్రీ ఏ. నరసింహమూర్తి ఇద్దరు నిందితులకు రెండేళ్ల కారాగార శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసులో శిక్ష పడిన. నిందితులుఎస్. చలపతి 57, తండ్రి: ఎస్. వెంకటస్వామి, పి. వడ్డిపల్లి హెచ్/ఓ బోడెవండ్లపల్లి యర్రావారిపాలెం మండలం. బి. సుబ్రహ్మణ్యం 33, తండ్రి: బి. జయన్న, ఓఎస్ గొల్లపల్లి గ్రామం, హెచ్/ఓ యల్లమంద, యర్రావారిపాలెం మండలం, తిరుపతి జిల్లా. తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, పర్యవేక్షణలో అమలు చేస్తున్న "గుడ్ ట్రయల్ మానిటరింగ్" వ్యవస్థ ద్వారా కేసు పటిష్టంగా నడిపించడంతో నేరం రుజువై ఈ తీర్పు వెలువడింది. కాగా, నిందితులు కోర్టుకు గైర్హాజరు కావడంతో గౌరవ న్యాయమూర్తి వారికి నాన్ బెయిలబుల్ వారెంట్లు (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేశారు. అనంతరం వారు 18-05-2026న కోర్టులో లొంగిపోగా, 21-05-2026 వరకు రిమాండ్ విధించారు. ఈరోజు కోర్టులో హాజరు పరచగా పై శిక్షను ఖరారు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, మాట్లాడుతూ, ఈ తీర్పు చట్టాన్ని ఉల్లంఘించే వారికి గుణపాఠం. జిల్లాలో అటవీ సంపదను రక్షించేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తోంది. ఎర్రచందనం అక్రమ రవాణాపై మా ఉక్కుపాదం నిరంతరం కొనసాగుతుంది" అని హెచ్చరించారు. ఈ కేసు దర్యాప్తు, పర్యవేక్షణ, కోర్టు లైజనింగ్‌లో కృషి చేసిన చంద్రగిరి డీఎస్పీ శ్రీ బేతపూడి ప్రసాద్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ ఏ. అమరనారాయణ, అప్పటి యర్రావారిపాలెం ఎస్ఐ శ్రీ రహీముల్లా, ప్రస్తుత భాకరాపేట సీఐ శ్రీ టి.వి. సత్యనారాయణ, ఎస్ఐ బి.వి. లోకేష్, కోర్టు లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ హరినాథ్, యర్రావారిపాలెం కోర్టు కానిస్టేబుల్ శ్రీ కె. శివ జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. పోలీసు అధికారుల సమష్టి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైంది. అక్రమ రవాణాపై పోరాటాన్ని జిల్లా పోలీసులు మరింత కట్టుదిట్టంగా కొనసాగిస్తారు. ప్రజలు కూడా సహకరించాలి" అని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

**- భక్తుల సౌకర్యార్థం టీటీడీ విస్తృత ఏర్పాట్లు**

**- శ్రీవారి సేవకుల ద్వారా నిరంతరాయంగా తాగునీరు, అన్న ప్రసాదాల పంపిణీ**

**- రేడియాడబ్రాడ్ కాస్టింగ్ ద్వారా 5 భాషల్లో భక్తులకు దర్శన సమాచారం**

**- వేసవి వేడికి ఇబ్బంది కలగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు**





**తిరుమల కదిలించే వార్త 21 మే**

తిరుమలలో స్కూలు సెలవు రోజుల్లోవేసవి రద్దీ నేపథ్యంలో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం తిరుమలలో భక్తుల రద్దీ నెలకొనడంతో భక్తుల సౌకర్యార్థం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. భక్తులకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పించేందుకు బాటగంగమ్మ సర్కిల్ నుండి గోగర్భం డ్యామ్ సర్కిల్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్ వరకు చలువ పందిళ్లు ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2, మ్యూజియం ప్రాంగణం, నారాయణగిరి ఉద్యానవనాల్లో నీడనిచ్చే షెల్టర్లు ఏర్పాటు చేశారు. క్యూ లైన్లలో వేచి ఉండే భక్తుల కోసం కూల్ పెయింటింగ్ పనులు, అదనపు తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా శ్రీవారి ఆలయం పరిసరాలు, లడ్డూ కౌంటర్లు, భక్తుల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాల్లో చలువ పందిళ్ల నిర్మాణం చేపట్టారు. ఇదే సమయంలో నాలుగు మాడ వీధుల్లో సింథటిక్ ఎనామెల్ కూల్ పెయింట్ వేయడం ద్వారా భక్తులు నేల వేడి నుండి ఉపశమనం పొందేలా చర్యలు తీసుకున్నారు. బాట గంగమ్మ గుడి సర్కిల్ నుండి ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఏర్పాటు చేసిన క్యూలైన్లలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. టీటీడీ అన్న ప్రసాద విభాగం ఆధ్వర్యంలో శ్రీవారి సేవకుల ద్వారా క్యూలైన్లలోని భక్తులకు నిరంతరాయంగా తాగునీరు, అన్న ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. ఉదయం అల్పాహారంగా పాలు ఉప్మా, పొంగల్, మధ్యాహ్నం సాంబారన్నం, పులిహోర, టమోట రైస్, రాత్రి పాలు ఉప్మా, సాంబారన్నం భక్తులకు నిరంతరాయంగా పంపిణీ చేయడం జరుగుతోంది. అదేవిధంగా టీటీడీ ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో తిరుమలలో రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శ్రీవారి సేవకుల ద్వారా భక్తులకు మొబైల్ వాటర్ డ్రమ్ములతో ఎప్పటికప్పుడు తాగునీరు పంపిణీ చేయడం జరుగుతోంది. తిరుమలలో పరిమిత సంఖ్యలో వసతి గదులు నిర్మిచబడ్డాయి. ప్రస్తుతం తిరుమలలో దాదాపు 7500 గదులు, ఐదు యాత్రికుల వసతి సముదాయాలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. గదులు పొందలేని భక్తులు తిరుమలలోని పీఏసీ-1, పీఏసీ-2, పీఏసీ-3, పీఏసీ పద్మనాభ నిలయం, పీఏసీ-5 లలో ఉన్న దాదాపు తొమ్మిదివేల లాకర్లు అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ కూడా భక్తులతో కిక్కిరిసి ఉన్నాయి. తిరుమలలో భక్తులు స్వామివారికి తలనీలాల సమర్పణ కోసం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో ప్రధాన కల్యాణకట్టతో 11 మినీ కల్యాణ కట్టలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. గత ఐదు రోజుల్లోనే 4,32,213 మంది భక్తులు అత్యధికంగా మే 18, 19, 20వ తారీఖుల్లో 43 వేలకు పైగా భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించడం విశేషం. అదేవిధంగా గత ఐదురోజుల్లో తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో దాదాపు 19 లక్షలకు పైగా భక్తులకు అన్న ప్రసాదాలు, టీ, కాఫీ, పాలు, మజ్జిగ అందించడం జరిగింది. వేసవి తీవ్రత దృష్ట్యా భక్తులకు నీడ, చల్లని వాతావరణం, తాగునీరు, అన్న ప్రసాదాలు, పరిశుభ్రత, వసతి, తలనీలాల సమర్పణ, లడ్డూలు వంటి అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు అందించడం కోసం టీటీడీ యంత్రాంగం విశేష కృషి చేస్తోంది. గత ఐదు రోజుల్లో నమోదైన భక్తుల రద్దీ గణాంకాలు (సంఖ్యల్లో)

| తేది | దర్శనాలు | తలనీలాలు | అన్న ప్రసాదాలు |
|---|---|---|---|
| మే 20 | 86,315 | 44,107 | 3,99,380 |
| మే 19 | 84,412 | 43,032 | 4,03,810 |
| మే 18 | 80,455 | 43,309 | 3,42,670 |
| మే 17 | 91,020 | 35,193 | 3,81,210 |
| మే 16 | 90,011 | 39,083 | 4,20,085 |

కాగా వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది దర్శన క్యూలైన్లు, నారాయణగిరి షెడ్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని కంపార్ట్మెంట్ లను నిరంతరాయంగా పర్యవేక్షిస్తూ రాత్రింబవళ్లు

భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శ్రమిస్తున్నారు.

# అటవీ భూముల పరిరక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించిన జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్



పుట్టపర్తి, కలెక్టరేట్, కదిలించే వార్త, మే 21: గురువారం కాన్ఫరెన్స్ హాల్ నందు జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన, జిల్లా అటవీ శాఖ అధికారి టి. చక్రపాణి తో కలిసి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రెవెన్యూ శాఖ పరిధిలోని అటవీ భూములు, అడవులను పోలి ఉన్న భూముల వివరాలను సేకరించి, వాటిని అటవీ శాఖ పరిధిలోకి బదలాయించే అంశంపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆర్డీఓలు , అటవీ క్షేత్ర అధికారులు, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# మే 22న శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

**- శిల్పకళ, భక్తి, సంప్రదాయాల సమ్మేళనంగా దివ్యక్షేత్రం**

**- ఒకే ప్రాంగణంలో మూడు దివ్య రూపాల్లో శ్రీమహావిష్ణువు దర్శనం**

**- రుణ విమోచనం ప్రసాదించే మహిమాన్విత క్షేత్రం శ్రీ గోవిందరాజస్వామి ఆలయం**

**తిరుపతి కదిలించే వార్త 21 మే**

తిరుపతి లోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో మే 23 నుండి 31వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు మే 22న శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. సాయంత్రం 5.30 నుండి 8 గంటల మధ్య ఈ కార్యక్రమం వైభవంగా జరగనుంది. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాల, సహస్రనామార్చన సేవలు నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం సేనాధిపతి ఉత్సవం, గంగుండ్ర మండపంలో ఆస్థానం, యాగశాలలో శాస్త్రోక్త అంకురార్పణ కార్యక్రమాలు జరుగుతాయి.

## ఆలయ ప్రాశస్త్యం

కలియుగ వైకుంఠమైన తిరుపతిలో వెలసిన శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయం భక్తి, చరిత్ర, శిల్పకళ, ఆగమ సంప్రదాయాల సమ్మేళనంగా యుగయుగాలుగా భక్తులను ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తోంది. ఈ దివ్యక్షేత్రాన్ని దర్శించుకున్న భక్తులకు రుణ విమోచనం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక ఆనందం కలుగుతాయని స్థల పురాణం పేర్కొంటోంది. స్వామివారి దివ్య మంగళ విగ్రహం భక్తుల హృదయాలలో విశ్వాసాన్ని నింపుతూ, జీవన సాఫల్యానికి మార్గదర్శకంగా నిలుస్తోంది.

## స్థల పురాణ వైభవం

పురాణాల ప్రకారం, శ్రీ మహావిష్ణువు భూలోకంలో శ్రీనివాసుడిగా అవతరించి తిరుమలలో నివసించే సమయంలో వివాహ మహోత్సవం నిమిత్తం కుబేరుని వద్ద నుండి ధనం అప్పుగా తీసుకున్నారని విశ్వసిస్తారు. ఆ ధనాన్ని కొలిచే బాధ్యతను శ్రీనివాసుడి అన్నయ్య అయిన శ్రీ గోవిందరాజ స్వామివారికి అప్పగించారని స్థల పురాణం తెలియజేస్తోంది. ధనాన్ని కొలుస్తూ అలసిన స్వామివారు ఆదిశేషునిపై శయనించిన దివ్య రూపమే నేటి శ్రీ గోవిందరాజ స్వామివారి దర్శనమని భక్తుల విశ్వాసం.

## గర్భాలయంలో దివ్య దర్శనం

ఆదిశేషునిపై శయనిస్తున్న స్వామివారు గర్భాలయంలో దివ్య కాంతులతో దర్శనమిస్తూ భక్తుల హృదయాలకు ప్రశాంతతను ప్రసాదిస్తున్నారు. స్వామివారి నాభి నుండి బ్రహ్మదేవుడు ఉద్భవించినట్లు, పాదాల వద్ద శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు, మోక్షం కోసం తపస్సు చేస్తున్న మధు--కైటభ రాక్షసులు కొలువై ఉన్న దృశ్యం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తుతోంది.

## దర్శనం -- నిత్య సేవలు

ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు సుప్రభాతంతో స్వామివారి సేవలు ప్రారంభమవుతాయి. ఉదయం 5.30 గంటలకు విశ్వరూప దర్శనం, 6.30 గంటలకు తోమాల సేవ, 7.30 గంటలకు అర్చన, 8 గంటలకు అర్చనానంతర దర్శనం నిర్వహిస్తారు. రాత్రి 8.30 గంటలకు ఏకాంత సేవతో నిత్య కార్యక్రమాలు ముగుస్తాయి. ఈ సేవల్లో పాల్గొనే భక్తులు అపార ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు. భక్తులకు ఉచిత అన్నప్రసాదాలుశ్రీ గోవిందరాజ స్వామివారిని దర్శించుకునే భక్తులకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు చక్కెర పొంగలి, అన్నం, సాంబారు, రసం, కర్రీ, చట్నీ, మజ్జిగతో రుచికరమైన భోజనం వడ్డిస్తున్నారు. అదేవిధంగా, ఆలయం సమీపంలోని పాత మ్యూజియంలో ప్రతిరోజూ ఉచిత అన్నప్రసాదాలను అందిస్తున్నారు. 2026 ఫిబ్రవరి నెల నుండి సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు సాంబారు అన్నం, పెరుగు అన్నం కూడా పంపిణీ చేస్తున్నారు.

## రాజగోపుర శిల్ప వైభవం

ఆలయంలోకి ప్రవేశించగానే దర్శనమిచ్చే ఏడు అంతస్తుల మహారాజగోపురం విజయనగర శిల్పకళా వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. స్థానిక పాలకుడు మట్ల అనంతరాజు నిర్మించిన ఈ గోపురం ద్రావిడ, విజయనగర నిర్మాణ శైలుల సమ్మేళనంగా శతాబ్దాలుగా భక్తులను ఆకట్టుకుంటోంది. మూడు అంతస్తులతో



నిర్మించిన పడి కావిలి గోపురం, మహాద్వార గోపురం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుండగా, విమాన గోపురం బంగారు తాపడంతో దివ్య కాంతులను విరజిమ్ముతోంది.

## బంగారు తాపడం మహాసంప్రోక్షణ

ఆలయంలో 70 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించిన పాత ధ్వజస్తంభం స్థానంలో 2018 ఏప్రిల్ 7న నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం 2018 ఏప్రిల్ 12న వైఖానస ఆగమోక్తంగా మహాసంప్రోక్షణ నిర్వహించారు. ఆలయ విమాన గోపురానికి 100 కిలోల బంగారంతో తాపడం పనులను 2021 సెప్టెంబర్ 14న ప్రారంభించి, 2023 మే 25న బంగారు తాపడం విమాన గోపుర మహాసంప్రోక్షణను అత్యంత వైభవంగా నిర్వహించారు.

## క్షేత్ర వైభవం

ఈ మహాక్షేత్రంలో శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి స్థానక రూపంలో, శ్రీ పార్థసారథి స్వామివారు ఆసీన రూపంలో, శ్రీ గోవిందరాజ స్వామివారు శయన రూపంలో దర్శనమిస్తారు. ఒకే ప్రాంగణంలో నిల్చున్న, కూర్చున్న, శయనించిన విష్ణుమూర్తుల సన్నిధులు దర్శనమివ్వడం ప్రపంచంలోనే అరుదైన విశేషంగా భావించబడుతోంది.

## ఉప ఆలయాలు .ఆధ్యాత్మిక సంపద

ఆలయ ప్రాంగణంలో వెలసిన శ్రీ ఆండాళ్ అమ్మవారు, శ్రీ పుండరీకవల్లి అమ్మవారు, సుదర్శన చక్రత్తాళ్వార్ సన్నిధి, భగవద్రామానుజాచార్యులు, తిరుమలనంబి, అనంతాళ్వారుల సన్నిధులు భక్తులకు మరింత ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తున్నాయి. వైష్ణవ సంప్రదాయానికి ప్రతీకలుగా ఈ దివ్య సన్నిధులు తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.



## మండపాల శిల్ప సౌందర్యం

ధ్వజారోహణ మండపం, మహామండపం, అర్ధమంటపం, అంతరాలయ మండపం, గర్భాలయ మండపం, బుగ్గ మండపాలు, రాములవారి మండపం, వాహన మండపం, ఉత్సవ మండపాలు అద్భుత శిల్ప సంపదతో భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.


## ఉత్సవాల వైభవం

భగవద్రామానుజాచార్యుల ఆదేశాల మేరకు తిరుమల తరహాలో శ్రీ గోవిందరాజ స్వామివారికి నిత్య, వార, పక్ష, మాస, సంవత్సరోత్సవాలను టీటీడీ అత్యంత వైభవంగా నిర్వహిస్తోంది. వైశాఖ మాసంలో బ్రహ్మోత్సవాలు, మాఘమాసంలో తెప్పోత్సవాలు, చైత్రమాసంలో వసంతోత్సవాలు. అశ్వయుజమాసంలో పవిత్రోత్సవాలు, జ్యేష్ఠాభిషేకం, పుష్పయాగం, పొన్నకాల్వ ఉత్సవం విశేషంగా జరుగుతాయి. ప్రతి పౌర్ణమికి గరుడసేవ, మూలమూర్తికి పూలంగి సేవ భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తుతున్నాయి

## పుష్కరిణి ఆధ్యాత్మిక కాంతి

ఆలయానికి ఎదురుగా సుమారు 2.5 ఎకరాల విస్తీర్ణంలో వెలసిన స్వామివారి పుష్కరిణి ఆధ్యాత్మిక కాంతిని విరజిమ్ముతోంది. ప్రతిరోజూ టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించే భక్తి, ఆధ్యాత్మిక, సంగీత కార్యక్రమాలు భక్తులను ఆహ్లాదపరుస్తున్నాయి. ప్రతి ఏడాది నిర్వహించే ఏడు రోజుల తెప్పోత్సవాలు వేలాది మంది భక్తులను ఆకర్షిస్తుంటాయి. పుష్కరిణిలో అలంకరించిన తెప్పపై స్వామివారి విహారం దర్శించుకోవడం భక్తులకు అరుదైన ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తోంది. రామాయణం, మహాభారతం, భాగవత ఘట్టాలతో, శిల్పకళా సంపదతో, వైష్ణవ సంప్రదాయ మహిమతో వెలసిన ఈ మహాక్షేత్రం తిరుపతి ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతోంది.

# కమల్ అమృత్ వాణి-142



వినయేన విభూషితః పురుషః సర్వత్ర రాజతే ।
అహంకారవశో నిత్యం స్వయమేవావసీదతి ॥
తాత్పర్యం.
వినయం మనిషికి నిజమైన అలంకారం.
అది గౌరవాన్ని పెంచుతుంది.
అహంకారం మనిషిని ఒంటరిగా మారుస్తుంది.
వినయవంతుడిని అందరూ ఇష్టపడతాడు.
మంచి ప్రవర్తన సంబంధాలను బలపరుస్తుంది.
వినయం జ్ఞానానికి శోభనిస్తుంది.గర్వం పతనానికి దారి తీస్తుంది.
-- కమలేకర్ నాగేశ్వర్ రావు 'కమల్'

## టిడిపి నేత మాసినేని రామయ్య మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అనంతపురం, కదిలించే వార్త, మే 21 :
అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాసినేని గ్రాండ్ హోటల్ యజమాని మాసినేని రామయ్య మృతి పట్ల అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తన ప్రగాఢ సంతాపం తెలిపారు.తెలుగు దేశం పార్టీ అంటే ఎంతో అభిమానించే రామయ్య పార్టీకి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. రామయ్య ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తన సానుభూతిని తెలియజేశారు.

## ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికగా "ఒక నెల - ఒక నియోజకవర్గం" కార్యక్రమం

### - జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి, కలెక్టరేట్, కదిలించే వార్త, మే 21:
నల్లమాడ ఎంపీడిఓ ఆఫీస్ నందు"ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సార్లు సందర్శన" కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, పుట్టపర్తి శాసనసభ్యులు పల్లె సింధుర రెడ్డి ,డిఆర్ఓ కొండయ్య , ఆర్.డి.ఓ పుట్టపర్తి సువర్ణ , తహశీల్దార్ నల్లమాడ మరియు ఇతర శాఖల అధికారులు హాజరవుతారు. ప్రజల నుండి రెవెన్యూ మరియు ఇతర సమస్యలపై అర్జీలు స్వీకరించబడతాయి.

## ధర్మవరం, పెనుగొండలో మంత్రి సత్య కుమార్ యాదవ్ పర్యటన

### - ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ, సమీక్షా సమావేశాలు మరియు బీజేపీ ప్రశిక్షణా కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి

### - ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించనున్న మంత్రి సత్య కుమార్ యాదవ్



ధర్మవరం, కదిలించే వార్త, మే 21:-- రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్య కుమార్ యాదవ్, మే 22 మరియు 23 తేదీల్లో ధర్మవరం మరియు పెనుగొండ ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ పర్యటనలో భాగంగా సంక్షేమ కార్యక్రమాలు, అధికారులతో సమీక్షా సమావేశాలు మరియు బీజేపీ ప్రశిక్షణా కార్యక్రమాల్లో మంత్రి పాల్గొననున్నట్లు వివరించింది. శుక్రవారం ఉదయం 10:00 గంటలకు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో నిర్వహించే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి కార్యాలయం పేర్కొంది. అనంతరం ఉదయం 11:00 గంటలకు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ూఝ×ఞజూ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొంటారు. గృహ నిర్మాణ ప్రాజెక్టుల పురోగతి, లబ్ధిదారులకు అందుతున్న సదుపాయాలు మరియు పనుల వేగవంతంపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. తర్వాత మధ్యాహ్నం 12:00 గంటలకు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ూఝూఞజూ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొని విద్యుత్ సరఫరా, ప్రజలకు అందుతున్న సేవలు, పెండింగ్ సమస్యల పరిష్కారంపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం మధ్యాహ్నం 1:00 గంటల నుండి ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ప్రజలు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలకు మంత్రి అందుబాటులో ఉంటారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి కార్యాలయం తెలిపింది. అదేవిధంగా శనివారం ఉదయం 11:00 గంటలకు పెనుగొండ పట్టణం, రొద్దం రోడ్డులోని సాయిగీతా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే బీజేపీ ప్రశిక్షణా కార్యక్రమంలో మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు మరియు ప్రజల్లో పార్టీ బలోపేతంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ రెండు రోజుల పర్యటనలో మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు మరియు ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి కార్యాలయం వెల్లడించింది.

## రాగులపాడులో ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు కార్యక్రమం

### - : పాల్గొన్న జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్

### - : సమస్యలను తక్షణమే పరిష్కరించాలి : జాయింట్ కలెక్టర్




అనంతపురం, కలెక్టరేట్, కదిలించే వార్త, మే 21 :
– వజ్రకరూరు మండలంలోని రాగులపాడు గ్రామంలో గురువారం ఒక నెల – ఒక గ్రామం – నాలుగు సందర్శనలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ పాల్గొన్నారు. ఇందులో భాగంగా రైతులు, ప్రజల నుంచి పలు సమస్యలను జాయింట్ కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకుని వినతిపత్రాలను స్వీకరించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయం తనిఖీ :– అనంతరం ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉరవకొండ మండలం రాచర్ల గ్రామానికి సంబంధించిన 'జశీతీతీవశ్రీఞఆశీఅ ఖూ= జుత్‌తీఅవం' మాడ్యూల్ యొక్క వ్యక్తిగత ధృవీకరణ చేపట్టారు.

# డాక్టర్ సుధాకర్ మరణానికి వైసీపీ వేధింపులే కారణం

### - దళితులు ఎప్పటికీ జగన్ని క్షమించరన్న టీడీపీ నేతలు

### - నగరంలో డా.సుధాకర్ సంస్మరణ కార్యక్రమం

### - మాస్క్ అడిగినందుకు ఒక వైద్యున్ని పిచ్చోడి చేసి చంపారన్న టీడీపీ నేతలు




అనంతపురం, కదిలించే వార్త, మే 21 :
డాక్టర్ సుధాకర్ తో పాటు ఎంతో మంది దళితుల్ని పొట్టన పెట్టుకున్న జగన్ రెడ్డి ఎస్సీ సామాజిక వర్గం ఎప్పటికీ క్షమించదని.. అనంతపురం అర్బన్ టీడీపీ నాయకులు అన్నారు. అనంతపురం నగరంలో గురువారం సాయంత్రం డాక్టర్ సుధాకర్ సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్బన్ నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్ సుధాకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ కరోనా సమయంలో మాస్కులు లేవన్న పాపానికి ఒక వైద్యున్ని పిచ్చోడిని చేశారన్నారు. ఆయన సస్పెండ్ చేయడమే కాకుండా.. అరెస్ట్ కూడా చేసి వేధింపులకు పాల్పడ్డారన్నారు. వైసీపీ నాయకులు ఆయన పై విమర్శలు చేయడంతో మానసిక క్షోభకు గురై చనిపోయారన్నారు. డాక్టర్ సుధాకర్ ది కచ్చితంగా వైసీపీ నేతల హత్యగా భావించాలన్నారు. ఒక్క సుధాకర్ మాత్రమే కాకుండా ఎమ్మెల్సీ కార్ డ్రైవర్ గా ఉన్న సుబ్రహ్మణ్యంని హత్య చేసి డోర్ డెలవరీ చేసిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. ఎస్సీలపై దాడులు, హత్యలే కాకుండా ఎస్సీ సామాజిక వర్గానికి ఇచ్చే సంక్షేమ పథకాలకు అంబేద్కర్ పేరు ఉంటే.. దానిని తొలగించి తన పేరు పెట్టుకున్నారన్నారు. వైసీపీ హయాంలో జరిగిన దారుణాలను, జగన్ రెడ్డి వ్యవహించిన తీరును ఎస్సీ సామాజిక వర్గం ఎప్పటికీ మరువదన్నారు. ఇప్పటికే ఒకసారి ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పారని.. భవిష్యత్ లో కూడా వారిని క్షమించే ప్రసక్తి ఉండదని టిడిపి నాయకులు స్పష్టం చేశారు.టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సంగా తేజస్విని, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పిఎల్ఎన్ మూర్తి, శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ, క్లస్టర్ ఇంచార్జ్ లు సాకే లక్ష్మీనరసింహ, వన్నురప్ప, గోపాల్ గౌడ్, పొట్లూరి కేశవ నాయుడు, దళవాయి వెంకటనారాయణ, టిడిపి నాయకులు మణిరవి వాల్మీకి, మోహన్ కుమార్, గోళ్ళ సుధాకర్ నాయుడు, భూలక్ష్మీ, వెంకట సుబ్బన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణకు సమిష్టిగా కృషి చేద్దాం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు

### - శ్రీ సత్యసాయి జిల్లాను బాలల సమస్యలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి






పుట్టపర్తి, కలెక్టరేట్, కదిలించే వార్త, మే 21:
గురువారం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలు నందు శ్రీ సత్యసాయి జిల్లాను బాలల సమస్యలు లేని ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డా. శ్రీనివాసమూర్తి, శ్రీమతి వెంకట పద్మలత పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్ నందు ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా బాలల హక్కుల పరిరక్షణపై ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం 18 ఏళ్ల లోపు చిన్నారుల విద్యా, వైద్యం కోసం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తూ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన జీవించే, అభివృద్ధి చెందే, రక్షణ పొందే, భాగస్వామ్యపు హక్కులను ప్రతి బిడ్డకూ అందేలా చూడాలన్నారు.ఉమ్మడి అనంతపురం, పుట్టపర్తి జిల్లాల్లో బాల్య వివాహాల నమోదు ఎక్కువగా ఉందని, వీటిని అరికట్టేందుకు జీవో నెం. 39 ప్రకారం నియమితులైన నిరోధక అధికారులు పటిష్టంగా పని చేయాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. సంక్షేమ హాస్టళ్లలో పిల్లలతో స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలి. వారి విద్యా, ఆరోగ్యం, వ్యక్తిగత భద్రతపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థులు సెల్‌ఫోన్లు, బైకులు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండేలా చూడాలి. ప్రతి హాస్టల్‌లో బాలల హెల్ప్‌లైన్ నంబర్ 1098, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వివరాలను ప్రదర్శించాలి. విద్యార్థుల కోసం సలహా/ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయాలి. జిల్లాలో 14 ఏళ్ల లోపు బాలకార్మికులు లేకుండా గుర్తించి, బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలి. బాలల చట్టాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు. విద్యా, సంక్షేమ, ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక చొరవతో సమన్వయం చేసుకొని పనిచేయాలి. మీడియాలో వచ్చే బాలల సమస్యల కథనాలపై తక్షణమే స్పందించి వాస్తవాలను కలెక్టర్, కమిషన్ దృష్టికి తీసుకురావాలి.ఈ కార్యక్రమం లో డిఆర్ఓ కొండయ్య, సిడబ్ల్యుసి చైర్మన్ రామలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ ప్రమీల, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్, సంక్షేమ శాఖ అధికారులూ పాల్గొన్నారు.

## సౌత్ ఇండియ జాతీయస్థాయి కుస్తీ పోటీలలో అనంత బాలిక (అనూష )కు సిల్వర్ మెడల్... ఇదే స్ఫూర్తితో మరిన్ని మెడల్స్ సాధించాలని ఆకాంక్షించిన జిల్లా కలెక్టర్, జెసి



అనంతపురం, కలెక్టరేట్, కదిలించే వార్త, మే 21 :– ఈనెల 15 నుంచి 17 వరకు జరిగిన సౌత్ ఇండియా జాతీయస్థాయి కుస్తీ పోటీలు పాండిచ్చేరి రాష్ట్రంలో ఉప్పల జిల్లా లోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం జరిగిన అండర్ -15 ఆల్ ఇండియా జాతీయస్థాయి కుస్తీ పోటీలలో మన రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి కొప్పల అనూష సిల్వర్ మెడల్ దక్కించుకున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మరియు జేసీ సి.విష్ణు చరణ్ మెచ్చుకుని ఇదే స్ఫూర్తితో మరిన్ని మెడల్స్ సాధించాలని వారు ఆకాంక్షించారు.– ఇదే సంవత్సరంలోనే ఈ అమ్మాయి ఉత్తరప్రదేశ్ లోనూ మరియు తమిళనాడులోను ఇప్పుడు పాండిచ్చేరి జాతీయ స్థాయి పోటీలలో ఒకే సంవత్సరంలోనే మూడు జాతీయ స్థాయి పోటీలలో ఆడడం చాలా ఆనందకరంగా ఉందని వారు అభినందించారు.– లిఅంతే కాకుండా ఈనెల 16వ తేదీ నుంచి 18 వ తారీఖు వరకు




విశాఖపట్నం లో జరిగిన రాష్ట్రస్థాయి శాప్ లీగ్ బాక్సింగ్ పోటీలలో 46 నుంచి 49 వ కేజీల విభాగంలో మేఘన రాజు బంగారు పథకం సాధించడం జరిగిందనీ డి.ఎస్.డి.ఓ మంజుల ఆనందం వ్యక్తం చేశారు.

# జిల్లాలో పెరుగుతున్న తీవ్రమైన ఎండలు, వడగాల్పుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

### - ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

అనంతపురం, కలెక్టరేట్, కదిలించే వార్త, మే 21 :
– జిల్లాలో పెరుగుతున్న తీవ్రమైన ఎండలు, వడగాల్పుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.– ప్రత్యేకించి వృద్ధులు, గర్భిణీలు, చిన్నపిల్లలు మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు బయటకు రాకూడదని, తరచూ మంచినీరు, ఓఆర్ఎస్ ద్రావణం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం వంటి సహజ పానీయాలను తీసుకోవాలని కలెక్టర్ ప్రజలకు సూచించారు. – అత్యవసరమై బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా గొడుగు, టోపీ ధరించాలని, కాటన్ దుస్తులను ధరించాలని సూచించారు. మసాలాలు, అధిక ప్రోటీన్లు ఉన్న ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. – వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్య ప్రదేశాల్లో త్రాగునీరు, చలివేంద్రాలు, నీడ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలు, కాలేజీలు, బస్టాండ్లు, మార్కెట్ యార్డులు, దేవాలయాలు వంటి జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ కార్మికులు, నిర్మాణ కార్మికులు, పారిశ్రామిక కార్మికులు వంటి బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారికి త్రాగునీరు సదుపాయం కల్పించేలా చూడాలని, మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఎండలో పని చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో వీధుల్లో ఉండే కుక్కలు, పక్షులకు తాగునీటి కోసం నీటి పాత్రలను ఏర్పాటుచేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ల ను ఆదేశించారు.



# దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపుతో ఇంధన పొదుపు దిశగా 'జూమ్' యాప్ ద్వారా నెలవారీ నేర సమీక్షా సమావేశం

**- మహిళలు, చిన్నారుల భద్రతను ప్రాధాన్యతగా తీసుకోవాలి**

**-- జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ IPS**






**అనంతపురం, క్రైమ్, కదిలించే వార్త, మే 21 :** జిల్లాలో పెండింగ్ లో ఉన్న గ్రేవ్ ఒ నాన్ గ్రేవ్ కేసులు, హత్య కేసులు, గ్రాజుూా కేసులు, డెకాయిటీ, రాబరీ, వాహనాలు దొంగతనం, మిస్సింగ్, చీటింగ్ కేసులు, ప్రాపర్టీ కేసుల ఛేదింపు- రికవరీలు, రోడ్డు ప్రమాదాలు, 174 జత్రీూ.జ కేసులు, ఎన్ఫోర్స్‌మెంట్ వర్క్, డిపిఓ కు సంబంధించి పెండింగ్ రిప్లై ఫైల్స్, పెండింగ్ చీదీఔం, చీణుూా కేసులలో దర్యాప్తు, సోషల్ మీడియా కేసులు గురించి పోలీస్ అధికారులతో సమీక్ష చేశారు.మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను మొగ్గ దశలోనే తుంచేయడం వల్ల నేరాలు జరుగకుండా వీలుంటుంది. మహిళల భద్రత బలోపేతం కోసం నూతనంగా అమలు చేస్తున్న స్త్రీరక్ష పోర్టల్ మరియు శక్తి యాప్ లపై అవగాహన చేయాలన్నారు.విజిబుల్ పోలీసింగ్ పెంచాలని...తద్వారా నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలు సులువవుతాయని సూచనలుప్రజలతో మమేకమై వారితో స్నేహభావంతో సహాయకారిగా మెలిగినప్పుడే పోలీసులు పట్ల సదాభిప్రాయం ఏర్పడి విశ్వాసం పెరుగుతుందిరోడ్డు ప్రమాదాలను తగ్గించాలి. ఎన్ఫోర్స్మెంట్ పెంచాలి. మైనర్ డ్రైవింగ్ , డ్రంకన్ డ్రైవింగ్ , ట్రిబుల్ రైడింగ్ , హెల్మెట్/ సీట్ బెల్ట్ ధరించని వాహన చోదకులకు చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. ఇతర ప్రభుత్వ విభాగాలతో కలసి బ్లాక్ స్పాట్స్ సందర్శించి తగు చర్యలు తీసుకోవాలి. రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచనలుమట్కా, పేకాట, గంజాయి, ఇసుక అక్రమ రవాణా, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయాలని... ఫ్యాక్షన్ ప్రభావిత/సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేసిన ఎస్పీమిస్సింగ్ (అదృశ్యమైన) వ్యక్తుల ఫోటోలను 'సిసిటివి- 360' యాప్‌లో అప్‌లోడ్ చేసి, ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా వారి ఆచూకీని సత్వరమే గుర్తించాలని ఆదేశించారుదర్యాప్తు చేపట్టే అన్ని కేసుల్లోనూ తప్పనిసరిగా 'ఈ-సాక్ష్య' యాప్‌ను వినియోగించి, ఘటనా స్థలాల ఫోటోలు, వీడియోలను అందులో నిక్షిప్తం చేయాలన్నారు.కొత్త క్రిమినల్ చట్టాలకు అనుగుణంగా గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో అభియోగ పత్రాలను (ఛార్జ్ షీట్లు) నిర్దిష్ట కాలపరిమితిలోగా న్యాయస్థానాల్లో దాఖలు చేయాలి.ఆపరేషన్ నైట్ సేఫ్టీ, స్టాప్ మైనర్ డ్రైవింగ్ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలిజిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుండీ ఇచ్చే ఆదేశాలు, కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలి. ఆయా పోలీసు అధికారులు గ్రామాల సందర్శన తప్పనిసరిగా చేయాలిఈ సమావేశంలో తాడిపత్రి ఏఎస్పీ శ్రీ రోహిత్ కుమార్ చౌదరి, ట్రైనీ ఐపిఎస్ అధికారి శ్రీ అశ్విన్, డీఎస్పీలు వి.శ్రీనివాసరావు, రవిబాబు, ఏ.శ్రీనివాస్, టి.శ్రీనివాస్, మహబూబ్ బాషా, జిల్లాలోని సి.ఐ లు, ఆర్ ఐ లు, ఎస్సైలు, ఏఎస్సైలు, తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బందికి యోగా, ధ్యానంపై సాధన

**- మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వమే లక్ష్యం**

**- జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ IPS**





**అనంతపురం, క్రైమ్, కదిలించే వార్త, మే 21 :** జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్, గ్రూా ఆదేశాల మేరకు ... ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా పర్యవేక్షణలో ఈరోజు స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో ఏ.ఆర్ మరియు ఈగల్, జీఆర్పీ పోలీస్ సిబ్బందికి ప్రత్యేక యోగా మరియు ధ్యానంపై సాధన కార్యక్రమం నిర్వహించారు. 'హార్ట్ ఫుల్ నెస్' సంస్థ సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. హార్ట్ ఫుల్ నెస్ ట్రైనర్ మరియు యోగా టీచర్ డాక్టర్ గోపి ఈ కార్యక్రమానికి విచ్చేసి, పోలీస్ సిబ్బందికి యోగాసనాలు, ప్రాణాయామం మరియు ధ్యానంపై ప్రత్యేక సాధన చేయించారు. నిరంతరం విధుల్లో ఉంటూ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొనే పోలీస్ సిబ్బందికి మానసిక ప్రశాంతతను చేకూర్చడం, వారి శారీరక దృఢత్వాన్ని పెంపొందించడం మరియు వృత్తిపరమైన బాధ్యతలను మరింత ఉత్సాహంగా నిర్వహించేలా చేయడమే ఈ యోగా మరియు ధ్యాన సాధన యొక్క ముఖ్య ఉద్దేశం. నిత్య జీవితంలో ధ్యానం మరియు యోగాలను ఒక భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవచ్చో డాక్టర్ గోపీనాథ్ ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, జిల్లా పోలీస్ కార్యాలయం ఏ.ఓ రవిరాం నాయక్, సూపరింటెండెంట్లు, ప్రసాద్ , నంద, ఆర్ ఎస్ ఐ లు జాఫర్, బాబ్జాన్, హనుమంతు (ఈగల్ ) జీఆర్పీ ఎస్సై వెంకటేశ్వర్లు, ఆర్ ఎస్ ఐ మద్దిలేటి, హార్ట్ ఫుల్ నెస్ ట్రైనర్లు గాయత్రి, లక్ష్మి మరియు పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా యోగా సాధన చేశారు.

# తెలుగుదేశం కార్యకర్తకి అండగా నేనున్నానంటూ ముందుకొచ్చిన బుల్లెట్ లింగమయ్య





**కదిలించే వార్త, తాడిపత్రి, మే 21**

తెలుగుదేశం కార్యకర్త కి నేనున్నానంటూ ముందుకొచ్చిన బుల్లెట్ లింగమయ్య..తాడిపత్రి గవర్నమెంట్ హాస్పిటల్ కి వెళ్లి పరామర్శించిన శ్రీ మహర్షి వాల్మీకి సేవలు రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ లింగమయ్య . కార్యకర్త ఆరోగ్యముతో బాగా ఉండాలని ఆ వెంకటేశ్వర స్వామిని కోరుకుంటున్నాం శ్రీ ఆ కలియుగ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని కార్యకర్తకి భరోసా ఇచ్చిన బుల్లెట్ లింగమయ్య. పుష్ప నారాయణ రెడ్డి రైతు సంఘం నాయకుడు ఎస్సీ ఎస్టీ గంగరాజు సాయికుమార్ నీలకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న ధర్మతేజ





శెట్టూరు మండలం, కదిలించే వార్త, మే 21 :

అనంతపురం జిల్లా శెట్టూరు మండలం ముచ్చర్లపల్లి గ్రామంలో జరుగుతున్న మహా ముని తన తపస్సుతో గంగను భూమి మీదకు తీసుకువచ్చిన దీశాలి అపర భగీరథుడు విగ్రహావిష్కరణకు గ్రామస్థులు, గ్రామ టీడీపీ నాయకుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు సూచనలతో విచ్చేసిన టీడీపీ నాయకుడు దేవినేని ధర్మతేజ కి గ్రామస్థులు, టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు..గ్రామస్థులను పేరు పేరునా ఆప్యాయంగా పలకరిస్తూ గ్రామస్థులతో కలసి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న దేవినేని ధర్మతేజ, మండల టీడీపీ నాయకులు...

## తిరుపతి వెళ్లే భక్తులకు గుడ్‌న్యూస్! కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను తీసుకొచ్చిన రైల్వే శాఖ




తిరుపతి--చర్లపల్లి మధ్య నడుస్తున్న వీక్లీ స్పెషల్ రైలును క్రమబద్ధీకరిస్తూ, కొత్తగా 17443/17444 వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును రైల్వే శాఖ ప్రవేశపెట్టింది. మే 28 నుంచి ఈ సేవలు ప్రారంభం కానుండగా, రాయలసీమ--హైదరాబాద్ ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుంది. మరిన్ని వివరాలు ఇలా ఉన్నాయి..తిరుపతి వెళ్లే భక్తులకు ఇండియన్ రైల్వేస్ శుభవార్త తెలిపింది. ప్రస్తుతం ప్రత్యేక రైలుగా నడుస్తున్న 07002/07031 తిరుపతి--చర్లపల్లి--తిరుపతి వీక్లీ స్పెషల్ రైలును క్రమబద్ధీకరిస్తూ, దాని స్థానంలో కొత్తగా 17443/17444 నంబర్లతో వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ కొత్త సేవలు మే 28, 2026 నుంచి ప్రారంభం కానున్నాయి. రైలు నెం.17443 తిరుపతి--చర్లపల్లి వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతి గురువారం సాయంత్రం 4.30 గంటలకు తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.25 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెం. 17444 చర్లపల్లి--తిరుపతి వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతి శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు బయలుదేరి శనివారం ఉదయం 7.30 గంటలకు తిరుపతికి చేరుకోనుంది.ఈ రైలు రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, ప్రొద్దుటూరు, నంద్యాల, గిద్దలూరు, మార్కాపూర్ రోడ్, పిడుగురాళ్ల, నడికుడే, మిర్యాలగూడ వంటి ముఖ్య స్టేషన్లలో ఆగుతుంది. రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల మధ్య ప్రయాణించే ప్రయాణికులకు ఇది మరింత సౌకర్యవంతమైన రైలు సేవగా మారనుంది.రైలు కూర్పులో 1 ఏసీ 2-టియర్, 3 ఏసీ 3-టియర్ కోచ్‌లు, 14 స్లీపర్ క్లాస్ బోగీలు, అలాగే 4 జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉండనున్నాయి. దీంతో సాధారణ ప్రయాణికుల నుంచి దీర్ఘదూర ప్రయాణికుల వరకు అందరికీ అనుకూలంగా ఉండేలా రైలును రూపొందించారు. ఈ కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్ సేవలతో తిరుపతి--హైదరాబాద్ మార్గంలో ప్రయాణికుల రద్దీ కొంత మేర తగ్గడంతో పాటు, రాయలసీమ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన రైల్వే కనెక్టివిటీ లభించనుంది.

# పీపీఈ కిట్లు అడిగినందుకు డా.సుధాకర్ ను వేధించి చంపారు

**- వైసీపీ దళిత వ్యతిరేక పార్టీ అన్న ఎమ్మెల్యే పరిటాల సునీత**

**- రామగిరి ఎస్సీ కాలనీలో డా.సుధాకర్ సంస్మరణార్థం కొవ్వొత్తుల ర్యాలీ**

**- దళితుల ఆత్మగౌరవం, సంరక్షణ కూటమి పాలనలో ఉంటుందన్న సునీత**





**రాప్తాడు నియోజకవర్గం, కదిలించే వార్త, మే 21 :** కరోనా సమయంలో పీపీఈ కిట్లు లేవని చెప్పినందుకు ఒక దళిత వైద్యున్ని వెంటాడి వేటాడి చంపిన సంఘటన ప్రజలెవరు మర్చిపోలేదని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో డాక్టర్ సుధాకర్ సంస్మరణార్థం కార్యక్రమం నిర్వహించారు. 2021 మే 21న డాక్టర్ సుధాకర్ మరణించిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొని ఎస్సీ కాలనీ వాసులతో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ కరోనా తాండవిస్తున్న సమయంలో చాలా మందికి సరైన వైద్య సదుపాయాలు లేక చనిపోయారన్నారు. చివరకు వైద్యులకు పీపీఈ కిట్లు, మాస్కులు లేని దుస్థితిని డాక్టర్ సుధాకర్ ప్రశ్నించారన్నారు. అయితే ఓర్చుకోలేని అప్పటి వైసీపీ ప్రభుత్వం సస్పెండ్ చేస్తే.. వైసీపీ నాయకులు సోషల్ మీడియాతో పాటు ఆయన్ని నేరుగా వేధింపులకు గురి చేశారన్నారు. ఆయన గొంతు నొక్కాలన్న ఉద్దేశ్యంతో అరెస్టు చేసి అవమానించారన్నారు. ఆ ఆవేదనతో ఆయన కుంగిపోయి మరణించారన్నారు. డాక్టర్ సుధాకర్ మరణం వైసీపీ ప్రభుత్వం చేయించిన హత్యగా భావించాల్సి ఉంటుందన్నారు. ఆ ప్రభుత్వంలో ప్రశ్నించే వారిని ఎలా వేధిస్తారని చెప్పేందుకు సుధాకర్ మరణం సాక్ష్యంగా నిలిచిందన్నారు. కేవలం ఒక్క సుధాకర్ మాత్రమే కాకుండా ఎంతో మంది దళితుల్ని పొట్టన పెట్టుకున్నారన్నారు. వందలాది మంది పై దాడులు, అకృత్యాలు జరిగాయన్నారు. అందుకే 2024ఎన్నికల్లో ఎస్సీలంతా వైసీపీకి తగిన బుద్ధి చెప్పారన్నారు. దళితులకు ఆత్మగౌరవం, సంరక్షణ కూటమి పాలనలో ఉంటుందని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు...

Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt)APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur . ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell : 6303427710